ADVERTISEMENT

మన గళం మన కలం

# రాయలసీమన్యూస్

THE VOICE OF RAYALASEEMA - LARGEST CIRCULATED RAYALASEEMA DAILY

ADVERTISEMENT

కర్నూలు · 15 జూలై, 2026 · బుధవారం · సంపుటి 1 · సంచిక 1

రూ. 6-50 · పేజీలు 9 · www.rayalaseemanews.com



## ఆక్వా సిండికేట్‌ను కూకటివేళ్లతో పెకలిస్తా! వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైయ...



ఆక్వా సిండికేట్‌ను కూకటివేళ్లతో పెకలిస్తా! వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైయస్ జగన్ రాష్ట్రంలో ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని, ఫీడ్ కంపెనీలు, కొనుగోలు సిండికేట్లు, ప్రభుత్వ నిర్లక్ష్యం కలిసి రైతుల జీవితాలను దెబ్బతీశాయని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. సీఎం సీట్లో చంద్రబాబు నాయుడు ఉంటే సిండికేట్లకు పండగ, రైతులకు మాత్రం కన్నీళ్లేనని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. భీమవరంలో ఆక్వా రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన ఆయన, వైయస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులకు కల్పించిన రక్షణ, గిట్టుబాటు ధర, రూపాయిన్నర విద్యుత్, APSADA వంటి సంస్కరణలను గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు కూటమి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. రైతుల ప్రభుత్వం తిరిగి వచ్చిన వెంటనే APSADAను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి, సిండికేట్ వ్యవస్థను అరికట్టి ఆక్వా రంగాన్ని మళ్లీ గాడిలో పెడతామని ఆయన భరోసా ఇచ్చారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఏమన్నారంటే.. రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా మా ప్రభుత్వమే ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రతి 15 రోజులకు ఒకసారి అంతర్జాతీయ మార్కెట్ ధరలను సమీక్షిస్తూ, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువకు రైతులు నష్టపోకుండా ఐదేళ్ల పాటు అండగా నిలిచాం. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా 100 కౌంట్ రొయ్యలకు కిలోకు రూ.230 కంటే..

→ మిగతా కథనం పేజీ 2

## రూ.2.19 లక్షల కోట్ల ప్రా...



రూ.2.19 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆమోదం కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు... కేంద్ర మంత్రివర్గం ఆర్థిక, సాంకేతిక రంగాలకు సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశీయ తయారీ సామర్థ్యాన్ని..

→పేజీ 2

## ఇండియా కూటమికి షాక్! : డీలిమిటేషన్ బిల్లుకు ఎన్సీ...



ఇండియా కూటమికి షాక్! డీలిమిటేషన్ బిల్లుకు ఎన్సీపీ సపోర్ట్.. ఈ వర్షాకాల సమావేశాల్లో ఎన్డీయే సర్కార్ మరోసారి నియోజకవర్గాల పునర్విభజన బిల్లు(డీలిమిటేషన్ బిల్లు)ను తీసుకురావాలని చూస్తోంది. అయితే, ఈ నేపథ్యంలో బీజేపీకి అనూహ్య మద్దతు లభించినట్లు తెలుస్తోంది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ బిల్లుకు మద్దతు తెలిపే అవకాశం ఉంది. అయితే, దేశంలో జనాభాతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్రాల్లో 50 శాతం సీట్ల..

→పేజీ 2

## ముద్రగడ పద్మనాభం పా...



ముద్రగడ పద్మనాభం పాడె మోసిన వైయస్ జగన్ మాజీ మంత్రి, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం పార్థివదేహానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ముద్రగడ పద్మనాభం నివాసానికి చేరుకున్న ఆయన, పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి అశ్రునివాళి అర్పించారు. అనంతరం ముద్రగడ పద్మనాభం సతీమణి..

→పేజీ 2

## పుంజుకున్న భారత స్టాక్ మార్కెట్ : స్వల్ప లాభాలతో స...



పుంజుకున్న భారత స్టాక్ మార్కెట్ స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్న సూచీలు భారత స్టాక్ మార్కెట్ ప్రధాన సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. మునుపటి సెషన్‌లో చమురు ధరల పెరుగుదల, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారీ నష్టాలను చవిచూసిన భారత స్టాక్ మార్కెట్లు, ఈరోజు ఆ నష్టాల నుంచి తేరుకుని స్వల్ప లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, రూపాయి విలువ పుంజుకోవడం వంటి పరిణామాలు ఉదయం పూట మార్కెట్లకు భారీ బూస్ట్‌ను ఇచ్చాయి. ఒక దశలో సెన్సెక్స్ 550 పాయింట్లకు పైగా, నిఫ్టీ 140 పాయింట్లకు పైగా లాభపడినప్పటికీ, మధ్యాహ్నం 1:00 గంటల సమయంలో ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి రావడంతో లాభాలు భారీగా హరించుకుపోయాయి. అయినప్పటికీ చివరకు మార్కెట్లు స్వల్ప లాభాల వద్ద ముగిశాయి. బీఎస్ఈ..

→పేజీ 2

ADVERTISEMENT

## కుడంకుళం అణు కేంద్రం డేటా లీక్?.. డార్క్‌వెబ్‌లో...

కుడంకుళం అణు కేంద్రం డేటా లీక్?.. డార్క్ వెబ్‌లో బ్లూప్రింట్లు భారతదేశంలో అతిపెద్ద అణు విద్యుత్ కేంద్రమైన తమిళనాడులోని కుడంకుళం ప్లాంట్ బ్లూప్రింట్స్ డార్క్ వెబ్‌లో లీక్ అయినట్లు తెలుస్తోంది. రాన్సమ్‌వేర్ గ్రూప్ ‘ వరల్డ్ లీక్స్’ ఈ ఫైళ్లను డార్క్ వెబ్‌లో పోస్ట్ చేసినట్లు రాయిటర్స్ నివేదించింది. ఈ ఫైళ్లలో అణు విద్యుత్ కేంద్రానికి సంబంధించిన కొన్ని భాగాల బ్లూ ప్రింట్లతో పాటు సరఫరాదారుల వివరాలు ఉన్నాయని, ఈ సమాచారం అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ గ్రూప్ నుంచి వచ్చిందని హ్యాకర్లు పేర్కొన్నారు. భారత్‌లో 7 అణు విద్యుత్ కేంద్రాల్లో కుడంకుళం అతిపెద్దది. ప్లాంట్ కాంట్రాక్టర్లలో ఒకటైన అనిల్ అంబానీకి చెందిన..

→పేజీ 2

## తెలంగాణలో ూ×= గడువు ఆగస్టు 3 వరకు పొడిగింపు

తెలంగాణలో SIR గడువు ఆగస్టు 3 వరకు పొడిగింపు తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల సంబంధిత ప్రక్రియల్లో భాగంగా స్పెషల్ సమ్మరీ రెవిసిజన్ కు అనుబంధంగా అమలులో ఉన్న SIR గడువు తేదీని పొడిగిస్తూ ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. తాజా నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో SIR కు సంబంధించిన గడువు ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ మేరకు సంబంధిత వర్గాలకు సమాచారం చేరవేసినట్లు ఎన్నికల వర్గాలు తెలియజేస్తున్నాయి. తెలంగాణలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు దశల్లో స్పెషల్ సమ్మరీ రెవిసిజన్ , సప్లిమెంటరీ ఇన్ఫర్మేషన్ రెపొర్ t వంటి ప్రక్రియలు కొనసాగుతున్నాయి. ఈ..

→పేజీ 2

## నోయిడాలో భారీ అగ్నిప్రమాదం, ఇద్దరి మృతి

నోయిడాలో భారీ అగ్నిప్రమాదం, ఇద్దరి మృతి ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ఎలక్ట్రిక్ స్కూటర్ నుంచి చెలరేగిన మంటలు బహుళ అంతస్తుల భవనానికి వ్యాపించి భారీ అగ్నిప్రమాదానికి దారితీశాయి. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. నోయిడా సెంట్రల్ డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం, సెక్టార్ 66లోని మమురా గ్రామంలో ఉన్న ఓ భవనంలో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఛార్జ్ చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్కూటర్ నుంచి ప్రారంభమైన ఈ మంటలు మొదట భవనంలో నిలిపి ఉంచిన పెట్రోల్ వాహనాలకు అంటుకొని, ఆ తర్వాత పై అంతస్తుల వరకు వేగంగా వ్యాపించాయి. దీంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. ఘటనా స్థలానికి..

→పేజీ 2

## టీటీడీ నిబంధనల మార్పు ఎఫెక్ట్.. ఒక్కం...



టీటీడీ నిబంధనల మార్పు ఎఫెక్ట్.. ఒక్కరోజే రూ.97 కోట్ల విరాళాలు శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన నిబంధనల్లో మార్పులు అమల్లోకి రానున్న నేపథ్యంలో చివరి రోజున తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ట్రస్టులకు భక్తులు భారీగా విరాళాలు అందజేశారు. ఒక్కరోజులోనే సుమారు రూ.97 కోట్ల విరాళాలు నమోదైనట్లు టీటీడీ వెల్లడించింది. టీటీడీ వివరాల ప్రకారం, ఆన్‌లైన్ ద్వారా 2,354 మంది భక్తులు రూ.87.34 కోట్లను విరాళంగా అందించగా, ఆఫ్‌లైన్ ద్వారా 106 మంది మరో రూ.9.63 కోట్లను సమర్పించారు. దీంతో ఒక్కరోజులోనే మొత్తం రూ.97 కోట్లకు పైగా విరాళాలు టీటీడీ ట్రస్టులకు చేరాయి. శ్రీవాణి ట్రస్ట్ నిబంధనల మార్పు నేపథ్యంలో భక్తులు పెద్దఎత్తున..

→పేజీ 2

## ఏపీ ఎప్‌సెట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ షెడ...



ఏపీ ఎప్‌సెట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల ఏపీ ఎప్‌సెట్ ఫలితాలు వెల్లడి కావడంతో అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించారు. ఈ మేరకు తొలి విడత ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. జులై 20 నుంచి 29 వరకు మొత్తం పది రోజుల పాటు రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు ప్రక్రియ కొనసాగనుంది. విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ జులై 22 నుంచి 31వరకు చేపట్టనున్నారు. జులై 25 నుంచి 31వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించనున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1న వెబ్‌ఆప్షన్లు మార్చుకొనేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు..

→పేజీ 2

## దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఏపీక...



దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే! దాల్మియా రెండోప్లాంట్ విస్తరణకు మంత్రి లోకేశ్ శంకుస్థాపన రాష్ట్రంలో అనుమతులు త్వరగా ఇవ్వడం వల్లే భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. పొరుగు రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలను తీసుకొస్తున్నామని చెప్పారు. వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండోప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. దాల్మియా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియాతో కలిసి లోకేశ్ భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ....

→పేజీ 2

## అమల్లోకి భారత్-యూకే సమగ్ర వాణి...



అమల్లోకి భారత్–యూకే సమగ్ర వాణిజ్య ఒప్పందం భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం బుధవారం నుంచి అధికారికంగా అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రాత్మక ఒప్పందం అమలుతో భారతీయ ఎగుమతులకు యూకే మార్కెట్లలో విస్తృత స్థాయిలో సుంకం రహిత ప్రవేశం లభించనుండగా, బ్రిటన్ నుంచి భారత్‌కు దిగుమతి అయ్యే పలు ఉత్పత్తులపై దశలవారీగా దిగుమతి సుంకాలు తగ్గనున్నాయి. ఈ వాణిజ్య ఒప్పందంపై 2025 జులై 24న లండన్‌లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, యూకే బిజినెస్ అండ్ ట్రేడ్ కార్యదర్శి జోనాథన్ రేనోల్డ్స్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర..

→పేజీ 2

క్లుప్త వార్తలు

### ఫీజు రెగ్యులేటరీ కమిటీ సభ్యుల నియామకానికి ఉత్తర్వులు

ఫీజు రెగ్యులేటరీ కమిటీ సభ్యుల నియామకానికి ఉత్తర్వులు అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హయ్యర్ ఎడ్యుకేషన్ ఫీజు రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిటీ (APHEFRMC) సభ్యుల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. ఉన్నత విద్యా సంస్థల ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన ఈ కమిటీకి సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కమిటీ సభ్యుల పదవీకాలాన్ని ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా నిర్ణయించింది.

ADVERTISEMENT

క్లుప్త వార్తలు

### ఎండలతో ఖరీఫ్ పంటలు ఎండిపోతున్న రైతులు ఆందోళనలో

అనంతపురం గుంతకల్లు నియోజకవర్గంలో వర్షాభావం తీవ్రతరం.. ఎండలతో ఖరీఫ్ పంటలు ఎండిపోతున్న రైతులు ఆందోళనలో అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాభావం తీవ్రరూపం దాల్చింది. గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల్లో ఎండల ఉధృతి పెరగడంతో ఇప్పటికే వేసిన పంటలు ఎండిపోతూ రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో మంచి వర్షాలు పడతాయని ఆశతో రైతులు పత్తి, కంది, వేరుశెనగ పంటలు విస్తారంగా సాగు చేశారు.

క్లుప్త వార్తలు

### మదనపల్లెలో పోలీసుల మెరుపు తనిఖీలు, ట్రాఫిక్ నిబంధాల ఉల్లంఘనపై చ...

మదనపల్లె లో పోలీసుల మెరుపు తనిఖీలు, ట్రాఫిక్ నిబంధాల ఉల్లంఘనపై చలానాలు అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ నిబంధాల అమలుపై పోలీసు విభాగం దృష్టి సారించింది. మదనపల్లె తట్టివారిపల్లి జంక్షన్ వద్ద తాలూకా ఎస్సై రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది భారీగా మోహరించి వాహనాలను ఆపి పత్రాలు, భద్రతా ప్రమాణాల అమలును పరిశీలించారు.

క్లుప్త వార్తలు

### మద్యం వేధింపులు తట్టుకోలేక కొడ...

మద్యం వేధింపులు తట్టుకోలేక కొడుకును హతమార్చిన తల్లి అనంతపురం నగరంలో కన్నతల్లి కాలయముడిగా మారిన దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యం మత్తులో నిత్యం వేధింపులకు పాల్పడుతున్నాడనే ఆగ్రహంతో ఒక తల్లి తన సొంత కుమారుడిని కత్తెరతో పొడిచి హతమార్చిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అనంతపురం నగరంలో మొదటి రోడ్డు, శివాలయం సమీపంలో నివసిస్తున్న బ్రహ్మచారి, సునీతమ్మ దంపతులకు కుమారుడు సురేంద్ర ఆచారి, ఒక కూతురు ఉన్నారు. చదువుకుని ప్రయోజకుడవుతాడనుకున్న సురేంద్ర ఆచారి కాలక్రమేణా దారి తప్పి మద్యానికి బానిసయ్యాడు.

ADVERTISEMENT

మన గళం మన కలం
రాయలసీమన్యూస్

బుధవారం · 15 జులై, 2026

## కూతురు క్రాంతిని అడ్డుకున్న ముద్రగడ అనుచరుల...



కూతురు క్రాంతిని అడ్డుకున్న ముద్రగడ అనుచరులు.. గోబ్యాక్ క్రాంతి అంటూ నినాదాలు! కాకినాడ జిల్లా కిర్లంపూడిలో మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నివాసం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తన తండ్రి ముద్రగడ పద్మనాభంకు కడసారి నివాళులు అర్పించేందుకు వచ్చిన కుమార్తె క్రాంతిని పోలీసులు, ముద్రగడ అనుచరులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. 'గో బ్యాక్ క్రాంతి' అంటూ అనుచరులు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో.. అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం కొనసాగింది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముద్రగడ, క్రాంతి మధ్య రాజకీయ, వ్యక్తిగత విభేదాలు నెలకొన్నాయి. ఆ విభేదాల ప్రభావంతోనే ఇప్పుడు కిర్లంపూడిలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. తండ్రి ముద్రగడ పద్మనాభంకు నివాళులు అర్పించేందుకు కిర్లంపూడికి బయలుదేరిన క్రాంతిని మొదట ప్రత్తిపాడు వద్ద పోలీసులు ఆపేశారు. కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకే ఆమెను అడ్డుకున్నామని పోలీసులు తెలిపారు. గతంలో తనకు, కుమార్తెకు మధ్య ఏర్పడిన విభేదాల నేపథ్యంలో తాను మరణిస్తే క్రాంతి రావద్దని ముద్రగడ చెప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారని పోలీసులు వెల్లడించారు. అయితే తండ్రిని చివరిసారైనా చూసేందుకు అనుమతించాలని క్రాంతి భావోద్వేగంతో పోలీసులను వేడుకుంది. ఆమె విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు.. నివాళులు అర్పించేందుకు పరిమిత అనుమతి ఇచ్చారు. నివాళులు అర్పించిన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. ముద్రగడ నివాసం వద్దకు చేరుకున్న క్రాంతిని ముద్రగడ అనుచరులు అడ్డుకున్నారు. 'గో బ్యాక్ క్రాంతి' అంటూ నినాదాలు చేశారు.

## హైదరాబా-అమరావతి-బందరు పోర్టు 12 లేన్ల గ్రీన్‌ఫీ...



హైదరాబాద్–అమరావతి–బందరు పోర్టు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య రాకపోకలు మరింత వేగవంతం కానున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ మధ్య ప్రయాణించే వారికి దాదాపు 100 కిలోమీటర్ల మేర దూరం తగ్గే అవకాశం కనిపిస్తోంది. ఇందుకోసం హైదరాబాద్–అమరావతి–బందరు పోర్టు వరకు 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తాజాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారి శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన అనుమతులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. హైదరాబాద్–అమరావతి–బందరు పోర్టు మధ్య 12 లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరిగితే, హైదరాబాద్–విజయవాడ మధ్య దూరం సుమారు 100 కిలోమీటర్ల మేర తగ్గుతుందని అధికారిక సమాచారం వెల్లడిస్తోంది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రాకపోకలు మరింత సులభతరం, వేగవంతం కానున్నాయని ప్రభుత్వం భావిస్తోంది.

## భీమవరంలో ఆక్వా రైతులతో వైఎస్ జగన్ ముఖాముఖి



భీమవరంలో ఆక్వా రైతులతో వైఎస్ జగన్ ముఖాముఖి బుధవారం భీమవరానికి చేరనున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆక్వా రైతులను పరామర్శించి, ఫీడ్ ధరల పెంపు, గిట్టుబాటు ధరలు, ఇతర సమస్యలపై వారితో ముఖాముఖి జరపనున్నారు. అనంతరం కిర్లంపూడి సందర్శనకు వెళ్లే అవకాశం ఉంది. ఆక్వా రంగం సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం భీమవరానికి రావడానికి సిద్ధమయ్యారు. ఈ సందర్శనలో భాగంగా ప్రాంతీయ ఆక్వా రైతులతో సమావేశమై వారి సమస్యలు, అభ్యంతరాలు, సూచనలను వినే కార్యక్రమం ఉండనుందని సమాచారం. ఇటీవల కాలంలో ఆక్వా రంగంలో వ్యయాలు పెరగడం, మార్కెట్ పరిస్థితులు మారడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ ముఖాముఖి ప్రాధాన్యత సంతరించుకుంది. ఆక్వా ఫీడ్ ధరలు పెరగడం వల్ల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగిందని రైతులు చెబుతున్నారు. గిట్టుబాటు ధరలు లభించకపోవడం, మార్కెట్‌లో ధరల మార్పులు, దిగుబడులపై ప్రభావం వంటి అంశాలు ఆక్వా రైతులను ఆర్థికంగా ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్ ఆక్వా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలపై సమగ్ర అవగాహనకు రావాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు సూచిస్తున్నాయి.

## కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి ఆరోగ్యంపై మ...

కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి ఆరోగ్యంపై మంత్రి నారా లోకేష్ ఆరా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితిపై మంత్రి నారా లోకేష్ ఆరా తీశారు. బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుతం బ్రహ్మం చౌదరి మణిపాల్ ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. బ్రహ్మం చౌదరి ఆరోగ్య స్థితిగతులపై సమాచారం తెలుసుకోవడానికి మంత్రి నారా లోకేష్, ఆయన కుటుంబ సభ్యులతో పాటు ఆస్పత్రి వైద్యులతో కూడా సంప్రదించారు. ఈ సందర్భంగా బ్రహ్మం చౌదరి సతీమణి గౌతమీ శ్వేతతో ఫోన్ ద్వారా మాట్లాడి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి, చికిత్స పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. తరువాత మణిపాల్ ఆస్పత్రి వైద్యులతో మంత్రి నారా లోకేష్ మాట్లాడారు. బ్రహ్మం చౌదరి ఆరోగ్య పరిస్థితి, ప్రస్తుతం అందిస్తున్న చికిత్స, తదుపరి వైద్య చర్యలపై వైద్యులు వివరాలు అందజేశారు. వైద్యుల నివేదిక ప్రకారం చికిత్స కొనసాగుతున్న విధానంపై మంత్రి లోకేష్ సమగ్రంగా సమాచారం తీసుకున్నారు. బ్రహ్మం చౌదరికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని వైద్యులను మంత్రి నారా లోకేష్ కోరారు. ఆయన సూచనల మేరకు ఆస్పత్రి వైద్య బృందం చికిత్సను మరింత శ్రద్ధతో కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. బ్రహ్మం చౌదరి త్వరగా కోలుకుని సాధారణ జీవితానికి తిరిగి రావాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్షించినట్లు ఆయన పరిసర వర్గాలు తెలిపాయి.

## రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు: కళ్లద్దాలు పంపిణీకి ప్రభుత్వం సిద్ధం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న 6 నుండి 18 ఏళ్ల వయస్సు గల విద్యార్థులందరికీ ఉచిత కంటి పరీక్షలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 43.30 లక్షల మంది విద్యార్థులను లక్ష్యంగా పెట్టుకుని వైద్యారోగ్యశాఖ, పాఠశాల విద్యాశాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. జులై 15 నుంచి పాఠశాలలలోనే ఈ కంటి పరీక్షల కార్యక్రమం ప్రారంభం కానుందని అధికారిక సమాచారం. దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి, సుమారు 2.50 లక్షల మందికి ఉచితంగా నాణ్యమైన కళ్లద్దాలు అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కంటి పరీక్షలతో పాటు విద్యార్థులకు కంటి సంరక్షణ, చదువుతప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం కూడా ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యంగా ఉంది.

← 1వ పేజీ తరువాత

## రూ.2.19 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ఆవె

పెంపొందించడం, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్థాయిని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా భారీ మొత్తంలో ప్రోత్సాహక పథకాలకు ఆమోదం తెలిపింది. మొత్తం రూ.2.19 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించినట్లు అధికార వర్గాలు సూచిస్తున్నాయి. కేబినెట్ నిర్ణయాల్లో ప్రధానంగా సెమీకాన్‌డక్టర్ రంగం, మొబైల్ ఫోన్ తయారీ రంగం ప్రోత్సాహానికి సంబంధించిన పథకాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సెమీకాన్‌డక్టర్ చిప్‌లకు పెరుగుతున్న డిమాండ్, సరఫరా అంతరాలు నేపథ్యంలో భారత్‌ను కీలక తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు వేగవంతం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే 'సెమీకాన్ 2.0' పేరుతో కొత్త దశ పథకానికి భారీ కేటాయింపు ప్రకటించింది. సెమీకాన్ 2.0 పథకానికి కేంద్రం రూ.1.27 లక్షల కోట్లను కేటాయించనుంది.

## మంగళగిరి ఎయిమ్స్‌లో కరోనా కలకలం



మంగళగిరి ఎయిమ్స్‌లో కరోనా కలకలం మంగళగిరి ఎయిమ్స్‌లో కరోనా లక్షణాలతో ఒక వ్యక్తి రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ప్రాథమిక చికిత్స అనంతరం హోం ఐసోలేషన్‌కు పంపి, ఆసుపత్రిలో ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు చేశారు. గుంటూరు జీజీహెచ్‌లోనూ వైద్యులు జాగ్రత్తలు ముమ్మరం చేస్తూ ఆర్టీపీసీఆర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళగిరి ఎయిమ్స్‌లో కరోనా వైరస్ భయం మరోసారి తలెత్తించింది. నిన్న కరోనా లక్షణాలతో ఒక వ్యక్తి ఆసుపత్రికి రావడంతో అక్కడి వైద్యులు, సిబ్బంది అప్రమత్తం అయ్యారు. జ్వరం, దగ్గు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న ఆ వ్యక్తిని వెంటనే ప్రత్యేక విభాగానికి తరలించి పరీక్షలు నిర్వహించారు.

← 1వ పేజీ తరువాత

## ముద్రగడ పద్మనాభం పాడె మోసిన వైయస్ జగన్

వైయస్ జగన్, ఈ తీరని విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కల్పించాలని ఆకాంక్షిస్తూ వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ పద్మనాభంతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్న వైయస్ జగన్, ఆయన ప్రజాసేవ, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. సమాజం కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిగా ముద్రగడ పద్మనాభం చిరస్థాయిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం అంతిమ సంస్కార కార్యక్రమం పూర్తయ్యే వరకు వైయస్ జగన్ అక్కడే ఉండి నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో స్వయంగా పాల్గొని ముద్రగడ పద్మనాభం పాడెను మోసి, ఆయన పట్ల తనకున్న గౌరవం, ఆత్మీయ అనుబంధాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ముద్రగడ పద్మనాభం గారికి అశ్రునివాళులు అర్పించారు.

## విశాఖలో అలల ఉధృతికి బోటు బోల్తా.. ఆందోళనలో మత్స్యకారులు



విశాఖలో అలల ఉధృతికి బోటు బోల్తా.. ఆందోళనలో మత్స్యకారులు విశాఖ హార్బర్ సమీపంలో చేపల వేటకు వెళ్లిన బోటు అలల ఉధృతికి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. హార్బర్ సమీపంలో చేపల వేటకు వెళ్లిన బోటు అలల తీవ్ర ఉధృతికి అదుపు తప్పి బోల్తాపడింది.

← 1వ పేజీ తరువాత

## కుడంకుళం అణు కేంద్రం డేటా లీక్?... డార్క్‌వెబ&లో బ్లూప్రింట్

చెందిన రిలయన్స్ గ్రూప్, థర్డ్-పార్టీ ఇండియన్ డేటా సెంటర్ సర్వీస్ ప్రొవైడర్ యోటా హోస్ట్ చేసిన సర్వర్‌లో తమ డేటా పాక్షిక లీక్‌కు గురైనట్లు, ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసినట్లు రాయిటర్స్ పేర్కొంది. అయితే, ఏ డేటా లీక్ అయిందనే వివరాలను వెల్లడించలేదు. వరల్డ్ లీక్స్ వెబ్‌సైట్‌లోని మొత్తం 858,000 రిలయన్స్ ఫైళ్లలో, 19,000 ఫైళ్ళు అత్యంత సున్నితమైనవిగా కనిపించాయి. అయితే, ఈ లీక్ అయిన పత్రాల్లో అణు రియాక్టర్ ప్రధాన వ్యవస్థలకు సంబంధించినవి కావని రాయిటర్స్ పేర్కొంది. లీక్ అయిన వాటిలో యూనిట్ 3, 4 లో ఉపయోగించిన వెంటిలేషన్, కూలింగ్ సిస్టమ్స్‌కు సంబంధించిన బ్లూప్రింట్లు ఉన్నట్లు సమాచారం. ఈ లీక్‌పై ప్రభుత్వం విచారణ చేపట్టినట్లు సమాచారం.

← 1వ పేజీ తరువాత

## తెలంగాణలోసా×= గడువు ఆగస్టు 3 వరకు పొడిగింపు

నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా తాజా సమీక్ష నిర్వహించింది. ఆ సమీక్ష అనంతరం గడువు పొడిగించాలని నిర్ణయించినట్లు అధికార వర్గాలు సూచిస్తున్నాయి. ప్రస్తుత నిర్ణయం ప్రకారం, SIR గడువు పొడిగింపుతో ఎన్నికల జాబితాల్లో మార్పులు, సవరణలు, సంబంధిత వివరాల సమర్పణ, పరిశీలన వంటి పనులకు అదనపు సమయం లభించనుంది. ముఖ్యంగా ఓటర్ల వివరాల సరిదిద్దడం, కొత్తగా అర్హులైన ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు వంటి అంశాల్లో ఈ పొడిగింపు ఉపయోగపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. తెలంగాణలో ఎన్నికల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ అధికారులు , జిల్లా స్థాయి ఎన్నికల యంత్రాంగం ఈ నిర్ణయానికి అనుగుణంగా తదుపరి కార్యాచరణను రూపొందించనున్నారు. ఇప్పటికే ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న బూత్ లెవెల్ ఆఫీసర్స్ , ఇతర సిబ్బందికి గడువు పొడిగింపు విషయాన్ని తెలియజేసి, అవసరమైన మార్గదర్శకాలు అందించే ప్రక్రియ కొనసాగుతోంది.

← 1వ పేజీ తరువాత

## నోయిడాలో భారీ అగ్నిప్రమాదం, ఇద్దరి మృతి

మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఉన్న దాదాపు 100 మంది నివాసితులను అత్యవసరంగా ఖాళీ చేయించారు. అగ్నిప్రమాద సమయంలో భవనం మొత్తం పొగతో నిండిపోయింది. పొగను పీల్చుకోవడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని అత్యవసరంగా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ, ఒక మహిళ సహా మరొకరు ప్రాణాలు కోల్పోయారని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన నిర్లక్ష్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలక్ట్రిక్ స్కూటర్ ఛార్జింగ్ సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, భవనంలో పెట్రోల్ వాహనాలు నిలిపి ఉంచిన తీరు వంటి అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. సంబంధిత బాధ్యులను అదుపులోకి తీసుకున్నట్లు నోయిడా సెంట్రల్ డీసీపీ పేర్కొన్నారు. ఘటన తర్వాత భవనంలో నివసిస్తున్న వారిలో భయాందోళనలు నెలకొన్నాయి.

## ఆగస్టు 7 నుంచి 'నేతన్న భరోసా పథకం ప్రారంభం

ఆగస్టు 7 నుంచి 'నేతన్న భరోసా' పథకం ప్రారంభం ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కొత్తగా 'నేతన్న భరోసా' పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమైంది. ఆగస్టు 7 నుంచి ప్రారంభమయ్యే ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి నేతన్న కుటుంబానికి రూ.25 వేల ఆర్థికసాయం అందించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగం అభివృద్ధి, నేతన్నల జీవనోపాధి రక్షణ లక్ష్యంగా ప్రభుత్వం 'నేతన్న భరోసా' పేరుతో కొత్త సంక్షేమ పథకాన్ని అమలు చేయనుంది. ఈ పథకం ఆగస్టు 7న ప్రారంభం కానుండగా, అర్హులైన నేతన్న కుటుంబాలకు ప్రత్యక్ష ఆర్థికసాయం అందించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పథకం ప్రకారం అర్హత సాధించిన ప్రతి నేతన్న కుటుంబానికి రూ.25 వేల ఆర్థికసాయం అందించనున్నారు. ఈ సాయం ద్వారా చేనేత కార్మికులు తమ వృత్తి కొనసాగింపుకు అవసరమైన ముడిసరుకు, పనిముట్లు, ఇతర అవసరాల కోసం కొంతవరకు ఉపశమనం పొందే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. చేనేత రంగంలో కొనసాగుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ పథకం రూపకల్పన చేసినట్లు ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. 'నేతన్న భరోసా' పథకం అమలుకు ప్రభుత్వం రూ.

## మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు

మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనపై కిర్లంపూడి పోలీసు స్టేషన్‌లో మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఆయన అనుచరులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కిర్లంపూడి పీఎస్‌లో కేసు నమోదైన విషయం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సమయంలో జరిగిన ఒక సంఘటన ఈ కేసుకు కారణమైంది. అంత్యక్రియల సందర్భంగా అధికారిక కార్యక్రమంలో గార్డ్ ఆఫ్ ఆనర్ నిర్వహిస్తుండగా అంబటి రాంబాబు, ఆయన అనుచరులు ఆటంకం కలిగించినట్లు పోలీసు వర్గాలు ప్రాథమికంగా పేర్కొంటున్నాయి. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరైనట్లు తెలిసింది. ఈ క్రమంలో గార్డ్ ఆఫ్ ఆనర్ కార్యక్రమం జరుగుతుండగా అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నట్లు సమాచారం. అంబటి రాంబాబు, ఆయన అనుచరుల కదలికల వల్ల కార్యక్రమం సజావుగా సాగడంలో అంతరాయం కలిగినట్లు పోలీసు అధికారులు పైస్థాయికి నివేదించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన పెద్దాపురం డీఎస్పీ, పెద్దాపురం, జగ్గంపేట సీఐల సమక్షంలోనే జరిగినట్లు అధికారిక వర్గాలు సూచిస్తున్నాయి. ఉన్నతాధికారుల ముందే అంబటి రాంబాబు, ఆయన అనుచరులు తమను ఉద్దేశపూర్వకంగా తోసేశారని సంబంధిత పోలీసు సిబ్బంది అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదు ఆధారంగా కిర్లంపూడి పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. అంత్యక్రియల వంటి సున్నితమైన కార్యక్రమంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం పట్ల పోలీసు వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. గార్డ్ ఆఫ్ ఆనర్ సమయంలో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని తోసే-

## విశాఖ ఆర్కే బీచ్‌లో తెలంగాణ యువతి ఆత్మహత్యాయత్నం

విశాఖ ఆర్కే బీచ్‌లో తెలంగాణ యువతి ఆత్మహత్యాయత్నం విశాఖపట్నం ఆర్కే బీచ్‌లో మంగళవారం సాయంత్రం సంచలనాత్మక ఘటన చోటుచేసుకుంది. తెలంగాణకు చెందిన లావణ్యప్రియ అనే యువతి తన ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన స్థానికులను కలవరపరిచింది. పోలీసుల సమాచారం ప్రకారం, లావణ్యప్రియ తన వెంట తీసుకువచ్చిన పెట్రోలు ఉపయోగించి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమె ఒంటికి నిప్పు అంటించుకున్న వెంటనే అక్కడున్న స్థానికులు, విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే యువతి చేతులు, ముఖం, తల భాగాలు తీవ్రంగా కాలిపోయినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన లావణ్యప్రియను తక్షణమే కింగ్ జార్జ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్థానిక పోలీసు అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. యువతి కు-

మన గళం మన కలం రాయలసీమన్యూస్

బుధవారం · 15 జులై, 2026

## నందనవనంలో భారీ అగ్నిప్రమాదం



నందనవనంలో భారీ అగ్నిప్రమాదం హైదరాబాద్ మీర్‌పేట్ పరిధి నందనవనంలో మెట్రో బార్ సమీపంలోని ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి భారీ అగ్నిప్రమాదానికి దారితీశాయి. సమీపంలోని మరో గోదాం, పక్క భవనంలోని ఇళ్లను కూడా మంటలు ఆవరించగా, మూడు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. హైదరాబాద్ నగర పరిధిలోని మీర్‌పేట్ ప్రాంతం నందనవనంలో శనివారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మెట్రో బార్ సమీపంలో ఉన్న ఓ ప్లాస్టిక్ గోదాంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కొద్ది సమయంలోనే మంటలు విస్తరించి గోదాం మొత్తం ఆవరించడంతో పరిసర ప్రాంతంలో భయాందోళన వాతావరణం నెలకొంది. ప్లాస్టిక్ సామగ్రి, ఇతర దహనశీల పదార్థాలు ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించినట్లు స్థానికులు చెబుతున్నారు. గోదాంలో మంటలు చెలరేగిన కొద్ది నిమిషాల్లోనే అగ్ని జ్వాలలు ఎగసిపడుతూ సమీపంలోని మరో గోదాంను, పక్క భవనంలోని కొన్ని ఇళ్లను కూడా ఆవరించాయి. దీంతో అక్కడ నివసిస్తున్న వారు బయటకు పరుగులు పెట్టి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయినట్లు సమాచారం. అగ్నిప్రమాదం తీవ్రత పెరుగుతుండటంతో స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మూడు ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించాయి. మంటలు భారీగా ఎగసిపడుతుండటంతో అగ్నిమాపక సిబ్బంది సమీప ప్రాంతాల్లోని ఇళ్లను, వ్యాపార సంస్థలను రక్షించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అగ్నిప్రమాదం కారణంగా గోదాంలలో ఉన్న భారీ పరిమాణంలో ప్లాస్టిక్ సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఆస్తి నష్టం భారీగా జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నప్పటికీ, ఖచ్చితమైన నష్టం వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాతే నష్టంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అగ్నిప్రమాదం కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ వల్లా, ఇతర కారణాల వల్లా మంటలు చెలరేగాయో తెలుసుకునేందుకు సంబంధిత శాఖలు పరిశీలనలు ప్రారంభించనున్నాయి. సంఘటనా స్థలానికి పోలీసులు కూడా చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, ప్రజలు ప్రమాద ప్రాంతానికి చేరకుండా పోలీసులు నియంత్రణ చర్యలు చేపడుతున్నారు. నందనవనం, మెట్రో బార్ పరిసర ప్రాంతంలో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొన్నప్పటికీ, అగ్నిమాపక సిబ్బంది చర్యలతో పరిస్థితి క్రమంగా సాధారణ స్థితికి వస్తోంది. మంటలు పూ-

## ఫ్యూచర్‌సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవం...



ఫ్యూచర్‌సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన హైదరాబాద్ ఫ్యూచర్‌సిటీలో అమెజాన్ ఏర్పాటు చేయనున్న కొత్త డేటా సెంటర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో డిజిటల్ మౌలిక వసతుల విస్తరణకు కీలకంగా భావిస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా అమెజాన్ వచ్చే 12 ఏళ్లలో భారీగా పెట్టుబడులు పెట్టనుంది. అధికారిక సమాచారం ప్రకారం, ఈ డేటా సెంటర్ అభివృద్ధి కోసం అమెజాన్ మొత్తం రూ.60వేల కోట్లు వెచ్చించేందుకు సిద్ధమైంది. ఫ్యూచర్‌సిటీలో 202 ఎకరాల విస్తీర్ణంలో ఈ డేటా సెంటర్‌ను నిర్మించనున్నారు. అదనంగా చందనవెల్లిలో మరో 98 ఎకరాలను అమెజాన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఫ్యూచర్‌సిటీలో ఏర్పడనున్న ఈ డేటా సెంటర్‌ను అతిపెద్ద హైపర్ స్కేల్ డేటా సెంటర్‌గా అభివృద్ధి చేయాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది. అధునాతన సాంకేతికత, విస్తృత స్థాయి డేటా నిల్వ, ప్రాసెసింగ్ సామర్థ్యాలతో ఈ కేంద్రం పనిచేయనుంది. హైదరాబాద్‌లో ఇది అమెజాన్ రెండో క్లౌడ్ రీజియన్‌గా ఏర్పాటుకానుండటం విశేషం. ఇప్పటికే నగరంలో ఉన్న క్లౌడ్ మౌలిక వసతులకు ఇది తోడ్పాటు అందించడంతో పాటు, దేశీయంగా మరియు అంతర్జాతీయంగా క్లౌడ్ సేవల విస్తరణకు దోహదం చేయనుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల ప్రతినిధులు, అమెజాన్ ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమంలో హాజరై ప్రాజెక్టు వివరాలను సమీక్షించారు. ఫ్యూచర్‌సిటీ, చందనవెల్లి ప్రాంతాల్లో అమెజాన్ పెట్టుబడులు, డేటా సెంటర్ నిర్మాణం ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ డేటా, క్లౌడ్ హబ్‌గా మరింత బలోపేతం చేసే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

## హైదరాబాద్‌లో చెరువుల అభివృద్ధికి పునరుత్తేజం



హైదరాబాద్‌లో చెరువుల అభివృద్ధికి పునరుత్తేజం హైదరాబాద్ నగరంలో చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హుస్సేన్‌సాగర్ తరహాలో నగరానికి చుట్టుపక్కల ఉన్న నాలుగు ప్రధాన చెరువులను ట్యాంక్‌బండ్లుగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.536 కోట్ల వ్యయంతో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ఫాక్స్ సాగర్, అమీన్‌పూర్ చెరువు, అంబీర్ చెరువు, సరూర్‌నగర్ చెరువులకు మేకోవర్ చేయనున్నారు. చెరువుల చుట్టూ ట్యాంక్‌బండ్లు, నడక మార్గాలు, వినోద సదుపాయాలు, పర్యాటకానికి అనువైన మౌలిక వసతులు ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతాలను ప్రజలకు విశ్రాంతి, వినోద కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. చెరువుల అభివృద్ధి కోసం ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో సమగ్ర మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయబడింది. ప్రతి చెరువు ప్రత్యేకత, పరిసర ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, నీటి నిల్వ సామర్థ్యం, పర్యావరణ అవసరాలను పరిగణనలోకి తీసుకుని మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రణాళిక ఆధారంగా చెరువుల అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేయనున్నారు. మొత్తం మూడు దశల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళిక సిద్ధమైంది. తొలి దశలో చెరువుల శుభ్రత, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, కాలుష్య నియంత్రణ, చెరువుల చుట్టూ ప్రాథమిక మౌలిక వసతుల ఏర్పాటు వంటి పనులు చేయనున్నారు. ఈ తొలి దశ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని సంబంధిత శాఖలు సూచిస్తున్నాయి. రెండో, మూడో దశల్లో పర్యాటకం, వినోదం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రాజెక్టులు అమలు చేయనున్నారు. చెరువుల చుట్టూ పచ్చదనం పెంపు, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, పిల్లల కోసం ఆట స్థలాలు, కుటుంబాల కోసం విశ్రాంతి ప్రాంతాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైన స్థలాలు ఏర్పాటు చేయడం వంటి అంశాలు ప్రణాళికలో భాగంగా ఉన్నాయి. హుస్సేన్‌సాగర్ సుందరీకరణతో నగరానికి వచ్చిన గుర్తింపును దృష్టిలో పెట్టుకుని, కొత్తగా అభివృద్ధి చేయబోయే ఈ నాలుగు చెరువులు కూడా హైదరాబాద్ పర్యాటక పటంలో ప్రత్యేక స్థానం సంపాదించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. చెరువుల అభివృద్ధి ద్వారా నగరంలో పర్యావరణ సమతుల్యతకు తోడ్పడటంతో పాటు, ప్రజలకు ఆరోగ్యకరమైన వినోద, విశ్రాంతి వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు.

## హైదరాబాద్‌లో 7వ తరగతి విద్యార్థినిపై అత్యాచారం : ...



హైదరాబాద్‌లో 7వ తరగతి విద్యార్థినిపై అత్యాచారం : ఉత్తరప్రదేశ్‌కు చెందిన రెహాన్ అరెస్ట్ హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఏడవ తరగతి చదువుతున్న ఓ బాలికపై లైంగిక దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన రెహాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహం, ఆందోళనకు దారితీసింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, నిందితుడు రెహాన్ బాధితురాలి ఇంటి సమీపంలో పండ్లు విక్రయిస్తూ అక్కడే జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని ఆమెపై దృష్టి పెట్టిన నిందితుడు. రెహాన్ తన ఇంట్లో చాక్లెట్లు, బిస్కెట్లు ఉన్నాయని చెప్పి బాలికను నమ్మబలికి ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు కేసు దర్యాప్తు వివరాల్లో వెల్లడైంది. ఘటన గురించి ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు కూడా పోలీసులు పేర్కొన్నారు. నిందితుడి బెదిరింపుల కారణంగా భయాందోళనకు గురైన బాలిక నెలల తరబడి ఈ విషయాన్ని ఇంట్లో ఎవరికీ వెల్లడించలేదు. రెహాన్ మరోసారి వేధింపులకు పాల్పడేందుకు ప్రయత్నించడంతో బాలిక మరింత భయంతో, ఆందోళనతో తన తల్లిదండ్రులకు జరిగిన విషయాన్ని చెప్పింది. బాలిక నుంచి వివరాలు తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు భాగంగా నిందితుడు రెహాన్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రెహాన్‌పై ప్రొటెక్షన్ అఫ్ చిల్డ్రన్ ఫ్రొం సెక్సువల్ ఆఫెన్సెస్ (POCSO) చట్టం కింద, అలాగే సంబంధిత భారతీయ దండన చట్టం సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసిన అనంతరం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధితురాలి వాంగ్మూలం, వైద్య పరీక్షలు, సంఘటన స్థల పరిశీలనతో పాటు ఇతర సాక్ష్యాధారాలను సేకరిస్తున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. మైనర్ బాలికలపై లైంగిక దాడి కేసులను అత్యంత తీవ్రంగా పరిగణించి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

మన గళం మన కలం
రాయలసీమన్యూస్



## 16 నుంచి జగన్నాథ రథయాత్ర.. ఏర్పాట్లు పూర్తి



16 నుంచి జగన్నాథ రథయాత్ర.. ఏర్పాట్లు పూర్తి ఒడిశాలోని పూరీ క్షేత్రంలో అత్యంత వైభవంగా జరిగే జగన్నాథ రథయాత్రకు సన్నాహాలు పూర్తయ్యాయి. జూలై 16, గురువారం నుంచి జూలై 24, శుక్రవారం వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రథయాత్రకు సంబంధించిన నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 1.ప్రారంభం: ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం, శుక్ల పక్షం ద్వితీయ తిథిన పూరీ జగన్నాథ ఆలయం నుంచి ఈ యాత్ర మొదలవుతుంది. 2.దారు తయారీ: రథాల నిర్మాణానికి ఎంపిక చేసిన వేప చెట్లను 'దారు' అని పిలుస్తారు. దీనికోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, శుభప్రదమైన చెట్లను ఎంపిక చేస్తారు. 3.రథాల పేర్లు: జగన్నాథుని రథాన్ని 'నందిఘోష' (గరుడధ్వజ) అని, బలరాముని రథాన్ని 'తలధ్వజ' అని, సుభద్ర దేవి రథాన్ని 'దర్పదాలన్' (పద్మ రథం) అని పిలుస్తారు. 4.నిర్మాణ విశేషం: వసంత పంచమి రోజున కలప ఎంపిక మొదలై, అక్షయ తృతీయ నాడు రథాల నిర్మాణం ప్రారంభమవుతుంది. రథాల తయారీలో మేకులు, ఇతర పదునైన లోహ వస్తువులను ఉపయోగించకపోవడం విశేషం. 5.హేరా పంచమి: రథయాత్ర ఐదో రోజైన 'హేరా పంచమి' నాడు, స్వామిని విడిచి వెళ్లారన్న ఆగ్రహంతో అమ్మవారు లక్ష్మీదేవి గుండిచా ఆలయానికి వచ్చి నందిఘోష రథ చక్రం వద్ద సంకేతక ఉత్సవాన్ని జరుపుతారు. 6.బహుడ యాత్ర: స్వామి తన అత్తగారి ఇల్లు అయిన గుండిచా ఆలయంలో వారం రోజుల పాటు బస చేసి, ఆషాఢ శుక్ల దశమి తిథిన తిరుగు ప్రయాణం అవుతారు. దీనినే 'బహుడ యాత్ర' అంటారు. 7. నీలాద్రి విజయం: తిరిగి ఆలయానికి చేరుకున్న స్వామిని, అమ్మవారిని గర్భాలయంలోకి ప్రవేశించే ప్రక్రియను 'నీలాద్రి విజయం' అని పిలుస్తారు. 8. ముస్లిం భక్త సాల్‌బేగ్: రథయాత్ర సాగే మార్గంలో సాల్‌బేగ్ అనే ముస్లిం భక్తుడి సమాధి వద్ద కూడా రథం ఆగుతుంది. ఆయన తల్లి హిందువు, తండ్రి ముఘల్ సైనికుడు. 9.రథం ప్రయాణం: పూరీ జగన్నాథాలయం నుంచి గుండిచా ఆలయం వరకు రథం దాదాపు 3 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. కొన్నిసార్లు ఈ దూరాన్ని చేరుకోవడానికి రోజంతా పడుతుంది. 10.పాప విముక్తి: రథపు తాళ్లను లాగడం ద్వారా భక్తులు తమ పాపాలు తొలగిపోతాయని, శ్రీహరిలోకంలో స్థానం పొందుతారని నమ్ముతారు.

## దేశవ్యాప్తంగా 75 'అమృత్ భారత్' రైల్వే స్టేషన్లను వ...



దేశవ్యాప్తంగా 75 'Amrit Bharat' రైల్వే స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణీకులకు కేంద్ర రైల్వే శాఖ శుభవార్తను అందించింది. దేశవ్యాప్తంగా ' అమ్రిత్ భారత్ స్టేషన్ స్కీం ' కింద పునరాభివృద్ధి చేసిన 75 హైటెక్ రైల్వే స్టేషన్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 17న ఒకేసారి వర్చువల్ పద్ధతిలో జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంతో ఆధునిక హంగులు, సౌకర్యాలతో ముస్తాబైన ఈ స్టేషన్లు అధికారికంగా ప్రయాణీకుల వినియోగానికి అందుబాటులోకి రానున్నాయి. విమానాశ్రయాల తరహాలో అత్యాధునిక సదుపాయాలతో రీ-డెవలప్ చేసిన ఈ స్టేషన్లలో తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కీలక కేంద్రాలు కూడా ఉన్నాయి. హైదరాబాద్‌లోని 'Hi-Tech City' రైల్వే స్టేషన్, అమరావతి సింహద్వారంగా భావించే మంగళగిరి రైల్వే స్టేషన్, విజయవాడ శివారులోని రాయనపాడు స్టేషన్‌లను సహా అనేక స్టేషన్లు ఈ జాబితాలో ఉన్నాయి. తెలంగాణ ఐటీ హబ్‌కు కీలకంగా ఉన్న హైదరాబాద్ ' Hi- టెక్ సిటీ ' రైల్వే స్టేషన్‌ను సుమారు రూ.26 కోట్ల వ్యయంతో అత్యంత ఆధునికంగా పునరాభివృద్ధి చేశారు. ఈ స్టేషన్ హైటెక్‌సిటీతో పాటు గచ్చిబౌలి, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ ఐటీ కారిడార్‌కు అత్యంత సమీపంలో ఉండటంతో రోజూ వేలాదిమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం 62 MMTS, సబర్బన్ రైళ్లు నడిచే ఈ స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మౌలిక వసతులను గణనీయంగా పెంచారు. స్టేషన్‌లో ఇప్పటికే ఉన్న రెండు లిఫ్టులకు అదనంగా మరో రెండు లిఫ్టులను ఏర్పాటు చేశారు. ప్రధాన ప్రవేశద్వారాన్ని విస్తరించి అభివృద్ధి చేయడంతో పాటు కొత్త ఓవర్ బ్రిడ్జి , విశాలమైన వెయిటింగ్ హాళ్లు, ఆధునిక టాయిలెట్లు, సరికొత్త స్టేషన్ భవనాన్ని నిర్మించారు. జంట నగరాలతో పాటు తెలంగాణలోని మరికొన్ని ప్రధాన స్టేషన్లలో కూడా ప్రస్తుతం ఆధునీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి సింహద్వారంగా భావించే మంగళగిరి నియోజకవర్గంలో మరో కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు విజయవంతంగా పూర్తయింది. దాదాపు రూ.12.56 కోట్ల బడ్జెట్‌తో అత్యాధునిక హంగులతో పునర్నిర్మించిన మంగళగిరి రైల్వే స్టేషన్ పనులు పూర్తయ్యాయి. ప్రయాణికులకు విమానాశ్రయ స్థాయి రూపు, అనుభూతి కలిగించేలా రీ-డెవలప్‌మెంట్ పనులను రైల్వే శాఖ చేపట్టింది. ఈ ఆధునీకరణలో భాగంగా స్టేషన్ ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రయాణికుల సౌకర్యార్థం విశాలమైన వెయిటింగ్ హాళ్లు, ఆధునిక బుకింగ్ కౌంటర్లు , కొత్త ప్లాటుఫార్మ్స్ , ఎస్కేలాటోర్స్ , లిఫ్ట్ సదుపాయాలు, డిజిటల్ డిస్ప్లే Boards ను ఏర్పాటు చేశారు. అలాగే స్టేషన్ పరిసరాల్లో పచ్చదనంతో కూడిన సుందరీకరణ పనులు చేపట్టారు. మంగళగిరితో పాటు విజయవాడ శివారులోని రాయనపడు రైల్వే స్టేషన్‌ను కూడా ఇదే తరహాలో ఆధునీకరించారు. తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న ఈ పునరాభివృద్ధి పనులు, దేశవ్యాప్తంగా ' అమ్రిత్ భారత్ ' పథకం కింద చేపట్టిన స్టేషన్ ఆధునీకరణకు భాగస్వామ్యంగా నిలుస్తున్నాయి. ఈ నెల 17న జరిగే వర్చువల్ కార్యక్రమంలో భాగంగా ఈ స్టేషన్లన్నింటినీ ప్రధాని నరేంద్ర మోదీ అధికారికంగా ప్రారంభించనున్నారు.

## పెట్రోల్ పంప్ దగ్గర దారుణం.. యువకుడి చేతులు నరి...

పెట్రోల్ పంప్ దగ్గర దారుణం.. యువకుడి చేతులు నరికేసి.. ఉత్తర్‌ప్రదేశ్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. పెట్రోల్ పంప్ దగ్గర గొడవ కారణంగా కొందరు వ్యక్తులు ఘాతుకానికి ఒడిగట్టారు. యువకుడిపై విచక్షణా రహితంగా దాడి చేసి.. రెండు చేతులు నరికేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చందేల్‌కు చెందిన జైవేంద్ర సింగ్ మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో కాన్పూర్ - సాగర్ హైవే పక్కన ఉన్న పెట్రోల్ పంప్ దగ్గరకు వెళ్లాడు. పెట్రోల్ పట్టించుకుంటున్న సమయంలో ఓ గుంపుతో జైవేంద్రకు గొడవ జరిగింది. ఆ గొడవ చిలికిచిలికి గాలి వానలా మారింది. ఈ నేపథ్యంలోనే ఆ గుంపు జైవేంద్రపై గొడ్డళ్లతో దాడి చేసింది. రెండు చేతులు నరికేసింది. జైవేంద్ర రెండు చేతులు మణికట్టు వరకు తెగి పక్కకు పడిపోయాయి. తలకు, రెండు కాళ్లకు కూడా తీవ్ర గాయాలు అయ్యాయి. దాడి అనంతరం ఆ గుంపు అక్కడినుంచి పరారైంది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ జైవేంద్రను జిల్లా ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి వేరే ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రి దగ్గరకు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇప్పటి వరకు ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారి కోసం అన్వేషణ కొనసాగిస్తున్నారు. జైవేంద్రపై దాడి జరగటంలో స్థానిక రాజకీయ నాయకుడి హస్తం ఉందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఇక, ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. జనం భయాందోళనకు గురవుతున్నారు.

## ఎఫ్‌బీఐ మోస్ట్ వాంటెడ్ జాబితాలో పంజాబ్ గ్యాంగ్...




ఎఫ్‌బీఐ మోస్ట్ వాంటెడ్ జాబితాలో పంజాబ్ గ్యాంగ్‌స్టర్ నితీశ్ కౌశల్ పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ నితీశ్ కౌశల్‌ను అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (FBI) మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది. అమెరికాలో హత్యలు, కిడ్నాప్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణా, పలు హింసాత్మక దాడులు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎఫ్‌బీఐ వెల్లడించింది. పంజాబ్‌కు చెందిన జగ్గు భగవాన్‌పురియా ముఠా నేతృత్వంలో నితీశ్ కౌశల్ ఈ నేరాలకు పాల్పడుతున్నాడని ఎఫ్‌బీఐ పేర్కొంది. ఈ ముఠా అమెరికా, కెనడా, యూరప్ దేశాల్లో విస్తృతంగా నేర కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్రిమినల్ నెట్‌వర్క్‌గా గుర్తించబడింది. అంతర్జాతీయ స్థాయిలో ఈ ముఠా చురుకుగా పనిచేస్తుండటంతో, అమెరికా దర్యాప్తు సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాయి. 'US డిస్ట్రిక్ట్ కోర్ట్ ఫర్ ది సెంట్రల్ డిస్ట్రిక్ట్ అఫ్ కాలిఫోర్నియా ' జూన్ 25న నితీశ్ కౌశల్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసింది. అమెరికా చట్టాల ప్రకారం అతనిపై పలు క్రిమినల్ కేసులు నమోదు కాగా, వాటికి సంబంధించి విచారణ కొనసాగుతోంది. అరెస్టు వారెంట్ జారీ చేసిన నేపథ్యంలో అతన్ని ఎఫ్‌బీఐ మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చి, అంతర్జాతీయ స్థాయిలో గాలింపు చర్యలను వేగవంతం చేసింది. ''Operation Hard Ball'' పేరుతో జగ్గు భగవాన్‌పురియా ముఠాపై ఎఫ్‌బీఐ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ముఠా కీలక సభ్యులపై ఉక్కుపాదం మోపుతూ, వారి నేర కార్యకలాపాలను అణచివేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే నితీశ్ కౌశల్‌ను అత్యంత ప్రమాదకర నేరస్థుడిగా గుర్తించి మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చినట్లు ఎఫ్‌బీఐ స్పష్టం చేసింది. జగ్గు భగవాన్‌పురియా ముఠా అమెరికా, కెనడా, యూరప్ దేశాల్లో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వసూళ్లు, హత్యాయత్నాలు, గ్యాంగ్ వార్‌లు వంటి నేరాలకు పాల్పడుతున్న విషయం ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. ఈ ముఠా అంతర్జాతీయ నేరజాలంతోనూ సంబంధాలు కలిగి ఉందని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో, ముఠా కార్యకలాపాలను పూర్తిగా కట్టడి చేయడానికి అమెరికా, ఇతర దేశాల దర్యాప్తు సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. నితీశ్ కౌశల్ స్థానం, అతని కదలికలపై సమాచారం అందించే వారికి ఎఫ్‌బీఐ ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించే అవకాశం ఉన్నట్లు విదేశీ మీడియా నివేదికలు సూచిస్తున్నాయి. అంతర్జాతీయ నేరజాలాన్ని అణచివేయడంలో భాగంగా ఇలాంటి గ్యాంగ్‌స్టర్లపై చర్యలు మరింత కఠినంగా కొనసాగనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## మణిపుర్‌లో అస్సాం రైఫిల్స్‌క్యాంప్‌పై మూకదాడి



మణిపుర్‌లో అస్సాం రైఫిల్స్ క్యాంప్‌పై మూకదాడి మణిపుర్‌లోని అస్సాం రైఫిల్స్ క్యాంప్‌పై నిరసనకారులు మూకదాడికి పాల్పడ్డారు. సాయుధ బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టిన కొన్నిగంటల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడం ఆందోళనకు గురిచేస్తోంది. క్యాంప్ వైపు దూసుకొచ్చిన నిరసనకారులు రాళ్లు విసరడంతో పాటు వాహనాలకు నిప్పంటించి విధ్వంసానికి తెగబడినట్లు అధికారిక సమాచారం వెల్లడించింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సేనాపతి పట్టణంలోని అస్సాం రైఫిల్స్ క్యాంప్‌పై ఈ దాడి జరిగినట్లు పోలీసులు తెలిపారు. క్యాంప్ పరిసరాల్లో అకస్మాత్తుగా గుమికూడిన నిరసనకారులు ముందుగా రాళ్లు విసరడం ప్రారంభించి, అనంతరం అక్కడ ఉన్న వాహనాలను లక్ష్యంగా చేసుకుని అగ్నికి ఆహుతి చేసినట్లు పేర్కొన్నారు. వారిని చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు టియర్ గ్యాస్‌ను ప్రయోగించాయి. టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించిన అనంతరం పరిస్థితి క్రమంగా అదుపులోకి వచ్చినట్లు అధికారులు చెప్పారు. అయితే దాడి సమయంలో జరిగిన ఆస్తి నష్టం, గాయాల వివరాలపై పూర్తి సమాచారం ఇంకా వెలువడాల్సి ఉంది. ఒక్లాంగ్ సమీపంలో కొందరు సాయుధులు తిరుగుతున్నారనే సమాచారంతో అస్సాం రైఫిల్స్ బలగాలు ముందుగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఆ ఆపరేషన్ సందర్భంగా స్థానికులు బలగాలను అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, వారికి సర్దిచెప్పి బలగాలు తనిఖీలను కొనసాగించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సెర్చ్ ఆపరేషన్ అనంతరం రాత్రి సమయంలోనే కొందరు నిరసనకారులు క్యాంప్ వద్దకు చేరుకుని రాళ్లు విసరడం, ఆస్తుల ధ్వంసానికి పాల్పడడం ఈ దాడికి దారితీసింది. క్యాంప్ లోపల, పరిసరాల్లో ఉన్న వాహనాలు, ఇతర వస్తువులు ఈ దాడిలో దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం సూచిస్తోంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని, అదనపు బలగాలను అప్రమత్తంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. ప్రాంతంలో మరిన్ని అవాంఛిత ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు, సాయుధ బలగాలు సంయుక్తంగా గస్తీ పెంచాయి. మణిపుర్‌లో ఇప్పటికే ఉద్రిక్తతలతో కూడిన వాతావరణం నెలకొన్న నేపథ్యంలో అస్సాం రైఫిల్స్ క్యాంప్‌పై జరిగిన ఈ దాడి భద్రతా పరిస్థితులపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది.

## జగన్ హయాంలో ఇసుక అక్రమాల కేసుల్లో ఈడీ దూకుడు.. కీలక సాక్షులకు నోటీసులు



## కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి



కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి నదుల అనుసంధానంతోనే రాష్ట్రం సస్యశ్యామలం : సీఎం చంద్రబాబు రెండేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.24వేల కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. మార్చి 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. పెన్నా-వంశధార నదుల అనుసంధానం చేయాలనేది లక్ష్యమని పేర్కొన్నారు. నదుల అనుసంధానం పూర్తి చేస్తే.. రాష్ట్రానికి కరవు ఉండదని స్పష్టం చేశారు. వచ్చే మూడేళ్లలో రూ.35వేల కోట్లు ఖర్చు చేసి.. 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. గంగా-కావేరి నదుల అనుసంధానం చేయగలిగితే దేశానికి తిరుగుండదన్నారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు ఈనెలలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయ్యాయని, ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇస్తామని ప్రకటించారు. సెప్టెంబరు 1న వెలిగొండ ఫేజ్-1 ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తామన్నారు. కేఎల్‌రావు విజయవాడలో జన్మించడం మన అదృష్టం.. శ్రీశైలం, నాగార్జునసాగర్ లాంటి అతిపెద్ద ప్రాజెక్టుల నిర్మాణంలో కేఎల్ రావు కీలకపాత్ర పోషించారు. ఆయన విజయవాడలో జన్మించడం మన అదృష్టం. ముగ్గురు ప్రధానుల దగ్గర పనిచేసిన గొప్ప వ్యక్తి. నీళ్లు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి జరుగుతుంది.ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణగా ఖ్యాతి గడించిందటే కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలే కారణం. శ్రీశైలం, నాగార్జునసాగర్ నిర్మించకుంటే ఏపీ ఇబ్బంది పడేది. ఏడాదిలో పట్టిసీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాను కాపాడిన ఘనత తెలుగుదేశం పార్టీది. 80 టీఎంసీలతో 13 లక్షల ఎకరాలు స్థిరీకరించాం. గోదావరి నుంచి ఏటా 2వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తాయి. ఎక్కడ నాకు పేరొస్తుందోనని.. నాడు పట్టిసీమ నిర్మిస్తుంటే అందరూ నన్ను విమర్శించారు. పట్టిసీమ ఒట్టిసీమ అన్నారు. విమర్శలు పట్టించుకొని ఉంటే పదేళ్లలో కృష్ణాడెల్టా ఏమయ్యేదో. వారి విమర్శలు పట్టించకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు పెట్టి పట్టిసీమ పూర్తిచేశా. గోదావరి నుంచి కృష్ణానదికి 450 టీఎంసీలు తీసుకొచ్చాం. పట్టిసీమ వల్ల కరవు సీమ.. హార్టికల్చర్ హబ్‌గా తయారైంది. నీళ్లుంటే పరిశ్రమలు వస్తాయి, ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఏడాదిలో గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి చేసి.. కియా ఫ్యాక్టరీ ఏర్పాటు చేశాం. అమరావతిని నిర్మిస్తుంటే విమర్శిస్తున్నారు. విజయవాడ, గుంటూరు, మంగళగిరి కలిపితే అమరావతి. 99శాతానికి పైగా రైతులు అమరావతికి భూములు ఇచ్చారు. ఆగస్టు 15 నాటికి సీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తవుతుంది. సీడ్ యాక్సిస్ రోడ్డులో ప్రయాణిస్తే.. అమరావతి విశి-

## జగన్ ది రాక్షస మనస్తత్వం.. : జల వనరుల శాఖ మం...



జగన్ ది రాక్షస మనస్తత్వం.. జల వనరుల శాఖ మంత్రి నిమ్మల ధ్వజం వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాక్షస మనస్తత్వం జగన్ రెడ్డిదని ధ్వజమెత్తారు. కరువు కాటాకాలతో రాష్ట్రం అల్లాడిపోవాలని ఆలోచన ఆయనదని విమర్శించారు. బుధవారం పవిత్ర సంగమం వద్ద 11 గంటలకు జలహారతి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు, మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. రైతు ద్రోహి జగన్ అని.. అలాంటి వ్యక్తి పార్టీ అధ్యక్షుడిగా ఉండే అర్హత కూడా లేదని ఎద్దేవా చేశారు. ఎల్‌నీన్ కారణంగా ఏపీలో ఎక్కడా ఒక చుక్క నీరు కూడా లేని పరిస్థితి అని ఆవేదన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్, శ్రీశైలం, జూరాల, ప్రాజెక్టుల్లో నీళ్లు లేని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతోనే ఈరోజు రైతాంగానికి పట్టిసీమ ప్రాణం పోస్తుందని ఉద్ఘాటించారు. కృష్ణా డెల్టాకు, రాయలసీమకు పట్టిసీమతో భద్రత కల్పించారని తెలిపారు. పోలవరం పూర్తి అయ్యేలోపు పట్టిసీమ ద్వారా నీళ్లు పంపిస్తుంటే, పట్టిసీమను ఒట్టు సీమని మాట్లాడిన జగన్ కృష్ణానది ఒడ్డుకొచ్చి ఈరోజు సమాధానం చెప్పాలని మంత్రి నిమ్మల రామానాయుడు డిమాండ్ చేశారు. పట్టిసీమ రైతాంగానికి భరోసా.. రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమ నేడు రూ.50 వేల కోట్ల ఆదాయం సృష్టించిందని మంత్రి నిమ్మల తెలిపారు. పట్టిసీమను వట్టిసీమ అన్న గొడ్డలిపార్టీ నాయకుడు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు.ఇప్పటివరకు పట్టిసీమ ద్వారా 445కు పైగా టీఎంసీలను కృష్ణా డెల్టాకు తరలించామని తెలిపారు. ఈసీజన్‌లో ఇప్పటికే 3 టీఎంసీలకు పైగా నీటిని కృష్ణానదిలోకి తరలించామని వెల్లడించారు. తీవ్ర కరువు పరిస్థితుల్లో 13.08 లక్షల ఆయకట్టు ఉన్న కృష్ణాడెల్టాకు నేడు పట్టిసీమ నీళ్లు ఊపిరిపోస్తున్నాయని తెలిపారు. పట్టిసీమ కేవలం కృష్ణాడెల్టాకు మాత్రమే కాదని రాయలసీమకు సైతం నీటి భద్రత కల్పించిన పథకమని వ్యాఖ్యానించారు. దేశంలోనే తొలి విజయవంతమైన నదుల అనుసంధాన పథకంగా ఈ పథకం గుర్తింపు పొందిందని వివరించారు. పట్టిసీమ కేవలం ఒక ఎత్తిపోతల పథకం కాదని, మన రైతాంగానికి ఓ భరోసా అని ఉద్ఘాటించారు. అందుకే పట్టిసీమ వైపు జగన్ కన్నెత్తి చూడలేదు.. దూరదృష్టి, ముందుచూపు, నిర్మాణాత్మక ఆలోచన కలిగిన నాయకుడు ఉంటే ప్రజలకు ఏవిధంగా మేలు జరుగుతుందో పట్టిసీమే ఉదాహరణ అని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు. పాలన అనుభవం లేకపోవడం, విధ్వంసపు ఆలోచనలు, ముందుచూపు లేకపోవడం, వల్లే గొడ్డలి పార్టీ నాయకుడు పట్టిసీమ వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు సూచనలతో సూపర్ ఎల్ నీనోను సమర్థంగా ఎదుర్కొనేందుకు, ముందస్తు ప్రణాళికలతో ప్రతి నీటి బొట్టునూ వినియోగించుకుంటున్నామని వెల్లడించారు. ఆల్మట్టి నుంచి జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జున సాగర్ వరకు ఖాళీ జలాశయాలతో ఉన్న కృష్ణాకు ఈ పట్టిసీమ నేడు ఉపిరి పోస్తుందని వివరించారు. పట్టిసీమ కట్టి, రూ.1300 కోట్లు గొడ్డలి పార్టీ నాయకుడు నీటి పాలు చేశారని మాట్లాడారని మండిపడ్డారు. కృష్ణా డెల్టా బీడుగా మారి, కరువు కాటకాలతో దుర్భిక్షంగా ఉండాలనేది రాక్షస మనస్తత్వం ఉన్న గొడ్డలి పార్టీ అధినేత కోరిక అని ఎద్దేవా చేశారు. కేఎల్ రావుకు నివాళి అర్పించిన మంత్రి నిమ్మల.. ప్రఖ్యాత ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు 125వ జయంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద మంత్రి నిమ్మల రామానాయుడు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు, కేఎల్ రావు కుమారుడు విజయ్ రావు, ఇరిగేషన్ సలహాదారులు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహ మూర్తి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. దేశ ఇరిగేషన్ రంగంలో డాక్టర్. కేఎల్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. హీరాకుడ్, శ్రీశైలం, నాగార్జున సాగర్, వంటి అనేక బహుళార్థక సాధక ప్రాజెక్టుల రూపకల్పనలో కేఎల్ రావు ప్రధాన పాత్ర పోషించారని ప్రశంసించారు. దేశంలో 50 ఏళ్ల క్రితమే నదుల అనుంధానాన్ని ప్రతిపాదించిన దార్శనికుడు డాక్టర్ కేఎల్ రావు అని కీర్తించారు. నాడు వాజ్‌పాయ్, నేడు నరేంద్రమోదీ, చంద్రబాబు నదుల అనుసంధానం కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని వ్యాఖ్యానించారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను, కృష్ణాజలాలతో అనుసంధానం చేసి, నదుల అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. పట్టిసీమను కొంతమంది దుర్మార్గులు హేళన చేశారు: ఎమ్మెల్యే వసంత కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా 12 లక్షలు ఎకరాలకు గోదావరి జలాలు పంపించడం సీఎం చంద్రబాబు ముందుచూపునకు నిదర్శనమని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వ్యాఖ్యానించారు. సీఎం మీద గతంలో ఇది పట్టిసీమ కాదని.. వట్టిసీమని కొంతమంది దుర్మార్గులు హేళన చేశారని ధ్వజమెత్తారు. ఈ దుర్మార్గులకి ఇదే కనువిప్పు అని చెప్పుకొచ్చారు. సాగునీరే కాకుండా తాగునీరు కూడా పట్టిసీమ భరోసా కల్పిస్తుందని ఉద్ఘాటించారు. మూడు రాజధానులు కూడా 13 జిల్లాలకు మధ్యలో పెడితే ఈ జగన్ రెడ్డి వచ్చి మూడు రాజధానులంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## ముంబై ఆసుపత్రి నుంచి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యా...



ముంబై ఆసుపత్రి నుంచి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డిశ్చార్జ్ ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో భుజాల శస్త్రచికిత్స అనంతరం ఏపీ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డిశ్చార్జ్ అయ్యారు. నాలుగు రోజుల విశ్రాంతి తర్వాత ఆయన ఇంటికి చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు, జనసేన కార్యకర్తలు, రాజకీయ నేతల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ముంబైలో ఆయనకు జరిగిన చికిత్స అనంతరం ఆసుపత్రి నుంచి విడుదల కావడంతో ఉపశమనం నెలకొంది. ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో పవన్ కళ్యాణ్ భుజాల సమస్యకు సంబంధించి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. సంక్షిప్త సమాచారం ప్రకారం, ఈ నెల 10న పవన్ కళ్యాణ్ రెండు భుజాలకు సర్జరీ చేయించుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు ఆయనకు నాలుగు రోజుల పాటు ఆసుపత్రిలోనే విశ్రాంతి కల్పించారు. అనంతరం పరిస్థితి స్థిరంగా ఉండటంతో డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. ప్రస్తుతం ఆయన ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిసింది. పవన్ కళ్యాణ్ భుజాలకు శస్త్రచికిత్స జరగడం, అనంతరం ఆయన ఆసుపత్రిలో ఉండటం వల్ల జనసేన పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంబంధిత సమావేశాల్లో ఆయన పాల్గొనడం తాత్కాలికంగా తగ్గింది. డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా కొంతకాలం వైద్యుల సూచనల మేరకు శారీరక శ్రమ తగ్గించి, అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడాన్ని పరిమితం చేసే అవకాశమున్నట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై అధికారిక వైద్య బులెటిన్ వివరాలు వెలువడకపోయినా, శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని పార్టీ వర్గాలు అంతర్గతంగా తెలియజేస్తున్నాయి. భుజాల సమస్య కారణంగా గత కొంతకాలంగా ఆయనకు అసౌకర్యం ఉన్నట్లు, దాన్ని అధిగమించేందుకు వైద్యుల సలహా మేరకు ఈ శస్త్రచికిత్స చేయించుకున్నట్లు సమాచారం. డిప్యూటీ ముఖ్యమంత్రి ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన వార్త తెలిసిన వెంటనే జనసేన శ్రేణుల్లో ఆనందం వ్యక్తమైంది. సామాజిక మాధ్యమాల్లో పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని అభిమానులు ఆకాంక్షలు వ్యక్తం చేస్తున్నారు. ఆయన పూర్తిగా కోలుకున్న తర్వాత రాష్ట్రంలో పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ బాధ్యతల్లో మరింత చురుకుగా పాల్గొనే అవకాశం ఉందని జనసేన వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత..అ...



కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో పాటు క్యాన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఓ కీలక అధ్యాయం ముగిసింది. 1953 జనవరి 22న తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో జన్మించిన ముద్రగడ పద్మనాభం ప్రజా జీవితంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. 1978లో తొలిసారిగా పత్తిపాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనంతరం 1983, 1985లో తెలుగుదేశం పార్టీ తరఫున విజయం సాధించి, ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి మంత్రివర్గంలో కూడా మంత్రి పదవిని నిర్వహించారు. మొత్తం ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి కాకినాడ లోక్‌సభ సభ్యుడిగా (1999) ఎన్నికై ప్రజాప్రతినిధిగా సేవలందించారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా కాపు సామాజిక వర్గ హక్కుల కోసం ఉద్యమించిన ప్రముఖ నేతగా ముద్రగడ పద్మనాభం ప్రత్యేక గుర్తింపు పొందారు. కాపు ఉద్యమంతో కీలక భూమిక పోషించిన ఆయన.. గత ఎన్నికల ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.. ఈ ఎన్నికల్లో వైసీపీ గెలివకపోతే.. తన పేరు ముద్రగడ పద్మనాభ రెడ్డిగా మార్చుకుంటానని ప్రకటించిన ఆయన.. కూటమి విజయం తర్వాత ఇకపై, నా పేరు ముద్రగడ పద్మనాభ రెడ్డి అంటూ ప్రకటించుకున్న విషయం విదితమే.. ఇక, ఆయన మరణవార్తతో రాజకీయ నాయకులు, అభిమానులు, కాపు సంఘాల ప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులర్పిస్తున్నారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు.. కాపు ఉద్యమ నేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం(73) అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ఫోన్‌లో మాట్లాడి.. సీఎం చంద్రబాబు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నాలుగుసార్లు శాసన సభ్యుడిగా, ఒకసారి లోక్ సభ సభ్యుడిగా, కేబినెట్ మంత్రిగా ముద్రగడ పద్మనాభం సేవలందించారని.. అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## బంగారం ధరలు యూటర్న్.. స్వల్పంగా పెరుగుదల



బంగారం ధరలు యూటర్న్.. స్వల్పంగా పెరుగుదల గత మూడు రోజులుగా తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు బుధవారం ఒక్కసారిగా భారీగా పెరిగాయి. దేశీయ మార్కెట్లలో 10 గ్రాముల బంగారం ధర అన్ని క్యారెట్లలో గణనీయంగా ఎగబాకింది. 24 క్యారెట్ల బంగారంపై 10 గ్రాములకు రూ.770, 22 క్యారెట్లపై రూ.700, 18 క్యారెట్లపై రూ.570 మేర పెరుగుదల నమోదైంది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ సమాచారం ప్రకారం, బుధవారం ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,570 వద్ద ట్రేడ్ అవుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,31,600, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,06,670గా ఉంది. తెలంగాణలోని ప్రముఖ పట్టణాల్లో బంగారం (10 గ్రాములు) ధరలు ఈ విధంగా ఉన్నాయి. వరంగల్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,570, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,600, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,670గా నమోదైంది. ఖమ్మం, నిజామాబాద్ పట్టణాల్లో కూడా ఇదే ధరలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పట్టణాల్లో 10 గ్రాముల బంగారం ధరలు స్వల్ప తేడాలతో ఉన్నాయి. కడపలో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,570, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,600, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,570గా ఉంది. విజయవాడ, విశాఖపట్నం, కాకినాడ పట్టణాల్లో 24, 22 క్యారెట్ల బంగారం ధరలు కడపతో సమానంగా ఉండగా, 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.1,07,570గా నమోదైంది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం (10 గ్రాములు) ధరలు కూడా గణనీయంగా పెరిగాయి. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,780, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,800, 18 క్యారెట్ల బంగారం రూ.1,10,000గా ఉంది. ముంబైలో 24 క్యారెట్లు రూ.1,43,570, 22 క్యారెట్లు రూ.1,31,600, 18 క్యారెట్లు రూ.1,07,670గా ఉన్నాయి. ఢిల్లీ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,720, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,750, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,820గా ట్రేడ్ అవుతోంది. కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 24 క్యారెట్లు రూ.1,43,570, 22 క్యారెట్లు రూ.1,31,600, 18 క్యారెట్లు రూ.1,07,670గా ఉన్నాయి. వడోదరా, ఇండోర్ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,620, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,650, 18 క్యారెట్ల బంగారం రూ.1,07,720గా ఉంది. కాన్పూర్‌లో 24 క్యారెట్ల బంగారం రూ.1,43,720, 22 క్యారెట్ల బంగారం రూ.1,31,750, 18 క్యారెట్ల బంగారం రూ.1,02,820గా నమోదైంది. నిపుణులు బంగారం ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లోని మార్పులు, రూపాయి మారకం విలువ, స్థానిక డిమాండ్ వంటి అంశాల ప్రభావంతో ఎప్పటికప్పుడు మారుతుంటాయని సూచిస్తున్నారు.

## హైదరాబాద్-తిరుపతి విమాన టికెట్లకు భారీ డిమాండ్




హైదరాబాద్-తిరుపతి విమాన టికెట్లకు భారీ డిమాండ్ హైదరాబాద్ నుంచి తిరుపతికి నడిచే విమాన సర్వీసులకు ఇటీవల డిమాండ్ నెలకొంది. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుపతి విమానాశ్రయంలో టీటీడీ శ్రీవాణి కౌంటర్‌ను ఏర్పాటు చేసింది. ఉదయం 7 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు ఈ టికెట్లు జారీచేస్తుంది. ఈ టికెట్లు పొందేందుకు ఉదయం వేళ తిరుపతికి చేరుకునేందుకు భక్తులు మొగ్గుచూపుతున్నారు. హైదరాబాదు నుంచి తిరుపతికి రోజుకు దాదాపు 8 విమాన సర్వీసులు ఉన్నాయి. అయినా ఉదయం 7:20గంటలకు వచ్చే ఇండిగో ఎయిర్‌బస్, 8:30గంటలకు వచ్చే ఎయిరిండియా సర్వీసులకే ఎక్కువ ఆదరణ లభిస్తోంది. దీంతో మొదట పరిమిత సంఖ్యలో మాత్రమే టికెట్లు కేటాయిస్తూ వచ్చిన టీటీడీ ప్రయాణికుల తాకిడి ఎక్కువ కావడంతో రోజుకు 200 టికెట్లను అదనంగా అందుబాటులోకి తెచ్చింది. శ్రీవాణి టికెట్ల కోసం వచ్చే ప్రయాణికుల రద్దీ కారణంగా ఈ విమాన టికెట్ ధరలు సైతం అమాంతం పెరుగుతున్నాయి. బుధవారం ధరలు ఇలా.. బుధవారం ఉదయం ఇండిగో విమాన టికెట్ ధర సుమారు రూ.15905, ఎయిర్‌ఇండియా టికెట్ ధర రూ.11905 వరకు నమోదైంది. మరోవైపు శ్రీవాణి టికెట్లు ప్రధానంగా ఈ రెండు విమానాల్లో వచ్చే ప్రయాణికులకే లభిస్తున్నాయనే కారణంగా వాటి టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. శ్రీవాణి టికెట్ల వల్లే ఈ సర్వీసుల ధరలు రోజురోజుకూ మరింత పెరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇంధన ధరలు తగ్గడం కూడా ఓ కారణం ఇటీవల విమాన ఇంధన ధరలు పెరగడంతో ప్రయాణికుల రద్దీని బట్టి విమాన సంస్థలు సర్వీసులను కుదించుకున్నాయి. అదేసమయంలో మధ్యాహ్నం తర్వాత వచ్చే ప్రయాణికులకు శ్రీవాణి టికెట్లు లభించడం లేదు. ఫలితంగా విమాన సర్వీసులు తగ్గడంతో నడిచేవాటిలో ధరలు పెరుగుతున్నాయి. కాగా ప్రయాణికుల రద్దీ తగ్గిన నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం తర్వాత హైదరాబాదు నుంచి తిరుపతికి రావాల్సిన 3, శివమొగ్గ నుంచి రావాల్సిన రెండు సర్వీసులను రద్దు చేసినట్టు సమాచారం.

## నష్టాల నుంచి కోలుకుని.. 500 పాయింట్ల లాభంలో సె...




నష్టాల నుంచి కోలుకుని.. 500 పాయింట్ల లాభంలో సెన్సెక్స్ జూన్ నెలలో అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తక్కువగా నమోదు కావడంతో ఆసియా మార్కెట్లు లాభాల్లో కదలాడుతున్నాయి. అలాగే రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న దేశాలపై విధించే సుంకాలను 500 నుంచి 100 శాతానికి తగ్గించాలని అమెరికా భావించడం కూడా సానుకూలంగా మారింది. ఇక, వరుస నష్టల నేపథ్యంలో మదుపర్లు కనిష్ఠాల వద్ద కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 96.11గా ఉంది. గత సెషన్ ముగింపు (77,054)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 100 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి ఎగబాకింది. ఉదయం 9:45 గంటల సమయంలో సెన్సెక్స్ 500 పాయింట్ల లాభంతో 77,554 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 147 పాయింట్ల లాభంతో 24,199 వద్ద కదలాడుతోంది (stock market news today). సెన్సెక్స్, నిఫ్టీలో బంధన్ బ్యాంక్, హ్యుందాయ్ మోటార్స్, శ్రీరామ్ ఫైనాన్స్, యూనో మిండా, ఐఈఎక్స్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి (share market news). పతంజలి ఫుడ్స్, టాటా ఎలాక్సీ, అదానీ పవర్, టీసీఎస్, హిందాల్కో మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 652 పాయింట్ల లాభంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 359 పాయింట్ల లాభంతో ఉంది.

మన గళం మన కలం రాయలసీమన్యూస్

బుధవారం · 15 జులై, 2026

# యూకే పర్యటనలో భారత్‌కు తొలి విజయం

**యూకే పర్యటనలో వరుస టీ20 పరాజయాల తర్వాత భారత్ వన్డేల్లో పుంజుకుంది.**



యూకే పర్యటనలో భారత్‌కు తొలి విజయం యూకే పర్యటనలో వరుస పరాజయాలతో ఒత్తిడిలోకి వెళ్లిన టీమ్ఇండియా.. ఎట్టకేలకు గెలుపు రుచి చూసింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో జరిగిన రెండు టీ20 సిరీస్‌ల్లో వైట్‌వాష్ పరాభవాలు చవిచూసిన భారత్.. వన్డే ఫార్మాట్‌కు మారగానే పుంజుకుంది. బర్మింగ్‌హామ్‌లో మంగళవారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లాండ్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ జట్టు 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ 9.5 ఓవర్లలో 62 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టి ఇన్నింగ్స్‌ను కట్టడి చేశాడు. ప్రసిద్ధ్ కృష్ణ 2, గుర్నూర్ బ్రార్ 2, జస్‌ప్రీత్ బుమ్రా 1 వికెట్ తీసి ఇంగ్లాండ్ పరుగుల ప్రవాహాన్ని ఆపారు. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ఆరంభంలో నెమ్మదిగా సాగింది. బుమ్రా, ప్రసిద్ధ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో 7 ఓవర్లకు స్కోరు 20 పరుగులకే పరిమితమైంది. గుర్నూర్ బ్రార్ బౌలింగ్‌కు రాగానే బెన్ డకెట్ దూకుడు చూపాడు. 45 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 43 పరుగులు చేసి ఇంగ్లాండ్‌ను 61/0 స్థితికి చేర్చాడు. అయితే అదే బ్రార్ ఒకే ఓవర్లో బెతెల్, డకెట్‌లను ఔట్ చేయడంతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది. తర్వాత బుమ్రా ఇంగ్లాండ్ కెప్టెన్ బ్రూక్‌ను 1 పరుగులకే పెవిలియన్ చేర్చగా.. ప్రసిద్ధ్ కృష్ణ ఒకే ఓవర్లో బట్లర్, సామ్ కరన్‌లను ఔట్ చేశాడు. దీంతో 61/0 నుంచి 80/5కు చేరుకున్న ఇంగ్లాండ్ తీవ్ర ఒత్తిడిలో పడింది. ఈ దశలో జో రూట్‌తో కలిసి జాక్స్ కాసేపు నిలిచి స్కోరును వంద దాటించాడు. దూబె బౌలింగ్‌లో వికెట్ కీపర్ రాహుల్ పట్టిన డైవింగ్ క్యాచ్‌కు జాక్స్ 20 పరుగుల వద్ద ఔట్ కావడంతో 107/6 స్థితిలో ఆతిథ్య జట్టు మరింత కష్టాల్లోకి వెళ్లింది. ఇక్కడి నుంచి జో రూట్, లియామ్ డాసన్ ఇన్నింగ్స్‌ను గట్టెక్కించారు. ఏడో వికెట్‌కు ఈ జోడీ 121 పరుగులు జోడించింది. రూట్ 76 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్‌తో 76 నాటౌట్‌గా నిలవగా.. డాసన్ 83 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్‌తో 68 పరుగులు చేశాడు. చివరి ఓవర్లలో అక్షర్ పటేల్ విజృంభించాడు. డాసన్‌తో పాటు ఆర్చర్, రషీద్, టంగ్‌లను వరుసగా ఔట్ చేసి ఇంగ్లాండ్ జోరుకు బ్రేకులు వేశాడు. సులువుగా 280 దాటేలా కనిపించిన ఇంగ్లాండ్.. చివరి నాలుగు వికెట్లను 30 పరుగుల తేడాలో కోల్పోయి 258 పరుగులకే ఆలౌటైంది. 262 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఛేదనలో మొదట తడబడి, తర్వాత నిలబడి, మళ్లీ తడబడి, చివరికి బలంగా నిలబడింది. అభిమానుల అంచనాలు ఉన్న రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి నిరాశపరిచారు. రోహిత్ 11 పరుగులు చేసి సామ్ కరన్ బౌలింగ్‌లో బ్రూక్‌కి క్యాచ్ ఇచ్చాడు. కోహ్లి 5 పరుగుల వద్ద జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో ఎల్బీ అయ్యాడు. 48 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన భారత్ పరిస్థితి ఆందోళన కలిగించింది. ఈ దశలో ఇప్పటికే క్రీజులో కుదురుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు శ్రేయస్ అయ్యర్ చక్కటి తోడయ్యాడు. గిల్ ఒక ఎండ్‌లో ఆకర్షణీయమైన షాట్లు ఆడుతుంటే.. మరో ఎండ్‌లో శ్రేయస్ జాగ్రత్తగా బ్యాటింగ్ చేశాడు. వీరిద్దరూ కలిసి శతక భాగస్వామ్యం నమోదు చేసి భారత్‌ను లక్ష్యం దిశగా నడిపించారు. శ్రేయస్ 35 పరుగులు చేసి రనౌట్ అయ్యాడు. 25 ఓవర్లకు 145/2తో పటిష్ఠ స్థితిలో ఉన్న టీమ్ఇండియాకు తర్వాతి ఓవర్లలో షాక్‌లు తగిలాయి. తొడ కండరాలు పట్టేయడంతో గిల్ 80 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. వెంటనే బ్రూక్ సూపర్ త్రోకు శ్రేయస్ రనౌట్ కాగా.. రాహుల్ టంగ్ బంతిని వికెట్ల మీదికి ఆడుకుని 1 పరుగులకే ఔట్ అయ్యాడు. 160/4తో భారత్ ఒక్కసారిగా ఒత్తిడిలో పడింది. ఈ క్లిష్ట పరిస్థితిలో స్పిన్ ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ భారత్‌ను గట్టెక్కించారు. మొదట కొన్ని ఓవర్ల పాటు జాగ్రత్తగా ఆడి ఇన్నింగ్స్‌ను స్థిరపరిచిన ఈ జంట.. తర్వాత సాధికారిక షాట్లతో లక్ష్యాన్ని కరిగిస్తూ పోయింది. అవసరమైన రన్‌రేట్ అందుబాటులో ఉండడంతో ఒత్తిడి లేకుండా బ్యాటింగ్ కొనసాగించారు. అక్షర్ పటేల్ 52 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్‌తో 57 నాటౌట్‌గా నిలవగా..

## ఇంగ్లాండ్ పర్యటనలో టీమ్ఇండియాకు గాయాల బెడ...



ఇంగ్లాండ్ పర్యటనలో టీమ్ఇండియాకు గాయాల బెడద.. గిల్, బ్రార్ ఫిట్‌నెస్‌పై సందిగ్ధత ఇంగ్లాండ్ పర్యటనకొచ్చిన టీమ్ఇండియా (India Tour England)కు గాయాల సమస్యలు వెంటాడుతున్నాయి. ఇప్పటికే వన్డే సిరీస్‌కు ముందే ఇద్దరు ఆటగాళ్లు గాయం కారణంగా వైదొలిగిన నేపథ్యంలో, ఇప్పుడు తొలి వన్డేలో మరో ముగ్గురు ఆటగాళ్ల ఫిట్‌నెస్ ఆందోళన కలిగిస్తోంది. ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి వన్డే మ్యాచ్ సమయంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, పేసర్ గుర్నూర్ బ్రార్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని మధ్యలోనే మైదానం వీడగా, శ్రేయస్ అయ్యర్ కూడా ఫీల్డింగ్ చేస్తూ అసౌకర్యానికి గురయ్యాడు. దీంతో టీమ్ఇండియా ఇంజూరీ మేనేజ్‌మెంట్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది. యూకే టూర్‌లో భారత జట్టుకు తొలి విజయం లభించిన ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. వన్డే సిరీస్‌కు ముందే హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి గాయం కారణంగా జట్టుకు దూరమయ్యారు. ఇప్పుడు కార్డిఫ్‌లో జరిగిన తొలి వన్డే (India vs England)లో గిల్, బ్రార్ సమస్యలు జట్టును ఆందోళనకు గురిచేశాయి. గుర్నూర్ బ్రార్ (Gurnoor Brar) ఆరంభంలో కొద్దిగా పరుగులు ఇచ్చినా, తర్వాత కీలక వికెట్లు తీసి తన సామర్థ్యాన్ని చాటాడు. 9 ఓవర్లు వేసిన అతడు 61 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. ఒకే ఓవర్‌లో ఇంగ్లాండ్ ఓపెనర్లను పెవిలియన్‌కు పంపి ప్రత్యర్థి జట్టుకు గట్టి దెబ్బతీశాడు. పదో ఓవర్ వేయడానికి సిద్ధమై పరుగు పెడుతుండగా కాలు నొప్పి కారణంగా అకస్మాత్తుగా ఆగిపోయాడు. వెంటనే ఫిజియో మైదానంలోకి వచ్చి చికిత్స చేసినా, బౌలింగ్ కొనసాగించే స్థితిలో బ్రార్ లేడు. దీంతో అతడు మైదానం వీడాల్సి వచ్చింది. అతడి గాయంపై అధికారిక అప్‌డేట్ ఇంకా వెలువడలేదు. బ్యాటింగ్‌లో సీనియర్ ఆటగాళ్లు విఫలమై నిరాశపరిచిన సమయంలో భారత్ ఓటమి దిశగా వెళ్తుందేమోనని అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ పరిస్థితుల్లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (80*) బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడి జట్టును నిలబెట్టాడు. తొలి ఓవర్ నుంచే జాగ్రత్తగా ఆడిన గిల్ తర్వాత దూకుడుగా రాణించాడు. ఒక దశలో గిల్ (Shubman Gill) చివరి వరకూ నిలిచి సెంచరీతో జట్టుకు విజయం అందిస్తాడని భావించిన సమయంలో, అతడి తొడ కండరాలు పట్టేయడంతో నిలబడేందుకే ఇబ్బంది పడ్డాడు. బ్యాటింగ్ కొనసాగించే వీలులేక డగౌట్‌కు వెళ్లిపోయాడు. మరోవైపు ఫీల్డింగ్ చేస్తూ శ్రేయస్ అయ్యర్ కూడా అసౌకర్యానికి గురయ్యాడు. ఫిజియో మైదానంలోకి వచ్చి చికిత్స చేయాల్సి వచ్చింది. అయితే అతడి గాయం తీవ్రతపై స్పష్టత లేదు. భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య కార్డిఫ్ వేదికగా రెండో వన్డే (Second ODI Match) గురువారమే జరగనుంది. కేవలం ఒక్క రోజు గ్యాప్‌లోనే మరో 50 ఓవర్ల మ్యాచ్ ఉండటంతో గిల్, బ్రార్ ఫిట్‌నెస్‌పై సందిగ్ధత నెలకొంది. బీసీసీఐ ఇప్పటి వరకు వారి గాయాలపై ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. క్రికెట్ వర్గాలు మాత్రం రెండో మ్యాచ్‌లో వీరు ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనా వేస్తున్నాయి. లేకపోతే ఇప్పటికి బోర్డు నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చేసేదని వారి అభిప్రాయం. ఈ సిరీస్‌లో ముగ్గురు సీనియర్లు జస్‌ప్రీత్ బుమ్రా, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ (Virat - Rohit) బరిలోకి దిగారు. జస్‌ప్రీత్ బుమ్రా (Jasprit Bumrah) తన అద్భుతమైన బౌలింగ్‌తో ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను కుదిపేశాడు. ఇంగ్లిష్ జట్టు సారథి హ్యారీ బ్రూక్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. అయితే బ్యాటింగ్‌లో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ విఫలమయ్యారు. వన్డే ప్రపంచ కప్‌కు సన్నాహకంగా భావిస్తున్న ఈ సిరీస్‌లో పరుగులు చేయకపోతే భవిష్యత్తులో ఈ ఇద్దరు సీనియర్ బ్యాటర్లకు ఇబ్బందులు తప్పవని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు. కార్డిఫ్‌లో జరగనున్న రెండో వన్డేలో విరాట్, రోహిత్ మంచి ఇన్నింగ్స్ ఆడాలని అభిమానులు ఆశిస్తున్నారు. గాయాల బెడద మధ్య టీమ్ఇండియా ఎలా సమీకరణాలు మార్చుకుంటుందో, రో-కో (Virat - Rohit) తమ ఫామ్‌ను ఎలా తిరిగి సాధిస్తారో గురువారం మ్యాచ్ నిర్ణయించనుంది.

## అర్జెంటీనా-ఇంగ్లాండ్ పోరుకు ప్రపంచం ఎదురుచూపు



అర్జెంటీనా–ఇంగ్లాండ్ పోరుకు ప్రపంచం ఎదురుచూపు ఫిఫా ప్రపంచకప్‌లో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. బుధవారం అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభమయ్యే రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, బలమైన ఇంగ్లాండ్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఫలితంపై ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులంతా కన్నేసి ఉన్నారు. ప్రపంచకప్ చరిత్రలో ఈ రెండు జట్లు ఇప్పటివరకు ఐదుసార్లు ఎదురెదురయ్యాయి. అందులో ఇంగ్లాండ్ మూడు మ్యాచ్‌లు గెలవగా, అర్జెంటీనా రెండు విజయాలు సాధించింది. మొత్తం అంతర్జాతీయ మ్యాచ్‌ల పరంగా చూస్తే ఇరుజట్లు 14 సార్లు పోటీపడ్డాయి. ఇంగ్లాండ్ ఆరు విజయాలతో ముందంజలో ఉండగా, అర్జెంటీనా మూడు మ్యాచ్‌లు గెలిచింది. మరో ఐదు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. అర్జెంటీనా–ఇంగ్లాండ్ జట్ల మధ్య ప్రపంచకప్ వేదికపై పోరు జరగడం 24 ఏళ్ల తర్వాత జరుగుతున్న విశేషం. ఇంగ్లాండ్‌తో ప్రపంచకప్‌లో ఆడబోయే అవకాశం అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సికి ఇదే తొలిసారి. ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్‌ల్లో నాటకీయత, ఉత్కంఠకు ఎప్పుడూ కొదవ ఉండదు. 1986 ప్రపంచకప్‌లో డియాగో మారడోనా చేసిన వివాదాస్పద ‘హ్యాండ్ ఆఫ్ గాడ్’ గోల్ ఇంగ్లాండ్‌పైనే నమోదైంది. 1998లో జరిగిన ప్రపంచకప్‌లో అర్జెంటీనా ఆటగాడు డియాగో సిమియోన్‌ను తన్నినందుకు ఇంగ్లాండ్ స్టార్ డేవిడ్ బెక్‌హామ్‌కు రెడ్‌కార్డు చూపించారు. ఆ సంఘటనలు ఈ పోరుకు చారిత్రక నేపథ్యాన్ని మరింత ఘనత చేకూరుస్తున్నాయి. ప్రస్తుత టోర్నీలో క్వార్టర్ ఫైనల్స్‌లో ఇరుజట్లు కూడా తీవ్రంగా శ్రమించి గెలుపొందాయి. అయితే మొత్తం ప్రదర్శనలో ఇంగ్లాండ్ కొద్దిగా ఎక్కువ స్థిరత్వాన్ని చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కీలక సెమీఫైనల్ పోరులో కెప్టెన్ హ్యారీ కేన్, జూడ్ బెల్లింగ్‌హామ్‌లపై ఇంగ్లాండ్ భారీగా ఆశలు పెట్టుకుంది. ఈ ఇద్దరూ ఇప్పటివరకు చెరో ఆరు గోల్స్ నమోదు చేసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. అర్జెంటీనా తరఫున మెస్సి, జూలియన్ అల్వారెజ్, లాతరో మార్టినెజ్, ఎంజో ఫెర్నాండెజ్‌లు ప్రధాన బలంగా నిలుస్తున్నారు. మెస్సి ఇప్పటివరకు ఎనిమిది గోల్స్ సాధించి గోల్డెన్ బూట్ పోటీలో ముందంజలో ఉన్నాడు. ఈ సెమీఫైనల్‌లో అర్జెంటీనా తన రెగ్యులర్ జెర్సీకి బదులుగా ప్రత్యామ్నాయ బ్లూ జెర్సీతో బరిలోకి దిగనుంది. బ్లూ జెర్సీ ధరించేందుకు అనుమతి ఇవ్వాలన్న అర్జెంటీనా ప్రత్యేక విజ్ఞప్తిని ఫిఫా ఆమోదించింది. సాధారణంగా రెండు జట్ల జెర్సీలు ఒకేలా ఉన్నప్పుడే ఒక జట్టు జెర్సీ మార్చుకుంటుంది. కానీ ఇంగ్లాండ్‌తో పోరులో అర్జెంటీనాకు అలాంటి సమస్య లేకపోయినా, గత విజయాల జ్ఞాపకార్థం బ్లూ జెర్సీకి ప్రత్యేక అనుమతి కోరింది. ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్‌పై అర్జెంటీనా సాధించిన రెండు విజయాల సమయంలో కూడా ఆ జట్టు ప్రత్యామ్నాయ బ్లూ జెర్సీనే ధరించింది. అదే అదృష్టం ఈసారి కూడా కలిసివస్తుందన్న నమ్మకంతో అర్జెంటీనా జట్టు ఉంది. ఇంగ్లాండ్ మాత్రం తన సంప్రదాయ తెలుపు జెర్సీతోనే ఆడనుంది. అర్జెంటీనా–ఇంగ్లాండ్ సెమీఫైనల్ పోరు బుధవారం అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభంకానుంది. విజేత జట్టు ఫైనల్‌లో స్పెయిన్‌తో తలపడనుంది.

## ఆసియా నంబర్‌వన్‌గా భారత యువ ఆర్చర్ ధీరజ్

ఆసియా నంబర్‌వన్‌గా భారత యువ ఆర్చర్ ధీరజ్ హైదరాబాద్: భారత యువ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర తాజా ర్యాంకింగ్స్‌లో ఆసియా నంబర్‌వన్‌గా నిలిచాడు. విజయవాడకు చెందిన ఈ కుర్రాడు పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో 225.5 పాయింట్లతో ఆసియా స్థాయిలో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఖండ స్థాయిలో అతడి ప్రదర్శనకు గుర్తింపుగా ఈ ర్యాంకింగ్ లభించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో కూడా ధీరజ్ తన స్థాయిని మెరుగుపరుచుకున్నాడు. మూడు స్థానాలు ఎగబాకి ఎనిమిదో ర్యాంకును సొంతం చేసుకున్నాడు. టాప్–10లో భారత్ నుంచి స్థానం దక్కిన ఏకైక ఆర్చర్‌గా ధీరజ్ నిలవడం విశేషం. అంతర్జాతీయ వేదికపై అతడి స్థిరమైన ప్రదర్శన ఈ పురోగతికి దోహదపడింది. ప్రపంచకప్ స్టేజ్–3 టోర్నీలో ధీరజ్ వ్యక్తిగత స్వర్ణ పతకంతో పాటు మిక్స్‌డ్ విభాగంలో కూడా స్వర్ణం గెలుచుకున్నాడు. ఈ విజయాలు అతడి ర్యాంకింగ్స్ పెరుగుదలలో కీలక పాత్ర పోషించాయి. అనంతరం జరిగిన స్టేజ్–4 టోర్నీలో మిక్స్‌డ్ విభాగంలో కాంస్య పతక పోరుకు అర్హత సాధించినప్పటికీ, చివరి దశలో కొద్దిలో పతకాన్ని చేజార్చుకున్నాడు. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్ ఆర్చర్ జ్యోతి సురేఖ ర్యాంకింగ్‌లో స్వల్ప వెనుకడుగు వేసింది. 291.25 పాయింట్లతో ఒక ర్యాంకు కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచింది. ఇటీవల టోర్నీల్లో ఆమె ప్రదర్శన స్థిరంగా ఉన్నప్పటికీ, ఇతర పోటీదారుల మెరుగైన స్కోర్లు కారణంగా ర్యాంకులో మార్పు చోటుచేసుకుంది. ఇక మహిళల విభాగంలో మరో భారత ఆర్చర్ తానిపర్తి చికిత కూడా ర్యాంకింగ్స్‌లో పడిపోయింది. ఆమె రెండు స్థానాలు కోల్పోయి 52వ ర్యాంకుకు చేరుకుంది. ప్రస్తుతం 81 పాయింట్లతో ఉన్న చికిత, రాబోయే టోర్నీల్లో మెరుగైన ప్రదర్శనతో తిరిగి పైస్థానాలకు చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఆర్చరీలో భారత ఆర్చర్ల ఈ ర్యాంకింగ్స్ మార్పులు దేశ క్రీడా రంగానికి ఉత్సాహాన్ని నింపుతున్నాయి. ముఖ్యంగా యువ ఆర్చర్ ధీరజ్ ఆసియా నంబర్‌వన్‌గా ఎదగడం, ప్రపంచ టాప్–10లో చోటు దక్కించుకోవడం భారత ఆర్చరీ భవిష్యత్తు దిశగా సానుకూల సంకేతాలుగా క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రపంచ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో భారత డబుల్స్ జ...



ప్రపంచ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో భారత డబుల్స్ జోడీలకు అరుదైన గౌరవం ప్రపంచ టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో భారత డబుల్స్ జోడీలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశాయి. పురుషుల డబుల్స్ విభాగంలో మానవ్ థక్కర్-మనుష్ షా జోడీ రెండో ర్యాంకును దక్కించుకుని దేశానికి అరుదైన గౌరవాన్ని తీసుకువచ్చింది. ఏ డబుల్స్ విభాగంలోనైనా భారత్‌కు ఇదే అత్యుత్తమ ర్యాంకు కావడం విశేషం. అంతర్జాతీయ స్థాయిలో భారత టేబుల్ టెన్నిస్ ప్రదర్శన గత కొన్నేళ్లుగా మెరుగుపడుతున్న నేపథ్యంలో తాజా ర్యాంకింగ్స్ మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యంగా పురుషుల డబుల్స్‌లో మానవ్ థక్కర్, మనుష్ షా జంట ప్రపంచ స్థాయి పోటీల్లో స్థిరమైన ప్రదర్శనతో ముందుకు సాగుతూ, రెండో స్థానానికి చేరుకోవడం ద్వారా భారత డబుల్స్ చరిత్రలో కొత్త మైలురాయిని నెలకొల్పింది. మహిళల డబుల్స్ విభాగంలో దివ్య-యశస్విని జంట పదో ర్యాంకు సాధించింది. మహిళల విభాగంలో భారత జోడీ టాప్-10లో నిలవడం దేశ మహిళా టేబుల్ టెన్నిస్ అభివృద్ధికి సంకేతంగా భావిస్తున్నారు. అంతర్జాతీయ టోర్నమెంట్లలో ఈ జంట ప్రదర్శించిన ప్రతిభకు తాజా ర్యాంకింగ్స్ ప్రతిఫలంగా నిలిచాయి. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో దియా, మనుష్ ద్వయం అయిదో ర్యాంకును సొంతం చేసుకుంది. పురుషుల డబుల్స్‌లో ఇప్పటికే రెండో ర్యాంకు సాధించిన మనుష్ షా, మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా దియా జోడీగా ఐదో స్థానంలో నిలవడం ద్వారా వ్యక్తిగతంగా కూడా విశేష విజయాన్ని నమోదు చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ టాప్-5లో ఉండటం దేశ టేబుల్ టెన్నిస్ స్థాయిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఉంది. తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి మూడు జోడీలు టాప్-10లో చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారి. పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మూడు విభాగాల్లోనూ భారత జోడీలు ప్రపంచ టాప్-10లో ఉండటం ద్వారా దేశ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల స్థిరమైన ప్రగతి స్పష్టమవుతోంది.

## ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో స్పెయిన్



ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లో స్పెయిన్ అట్లాంటా: స్పెయిన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు తన సత్తాను మరోసారి చాటింది. అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఆసక్తికరంగా సాగిన సెమీఫైనల్లో స్పెయిన్ 2-0 తేడాతో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మికెల్ ఒయర్జ్‌బల్ 22వ నిమిషంలో పెనాల్టీ ద్వారా స్పెయిన్‌కు తొలి గోల్ అందించాడు. అనంతరం 58వ నిమిషంలో పోరో రెండో గోల్ నమోదు చేయడంతో జట్టు ఆధిక్యం 2-0కు చేరింది. మ్యాచ్ మొత్తం స్పెయిన్ బలమైన రక్షణతో ఫ్రాన్స్ దాడులను సమర్థంగా తిప్పికొట్టింది. ఈ ప్రపంచకప్‌లో స్పెయిన్ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లోనూ ఓటమి చవిచూడలేదు. రెండు విజయాలు, ఒక డ్రాతో గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచిన స్పెయిన్.. నాకౌట్ దశలో ఆస్ట్రియా, పోర్చుగల్ జట్లను ఓడించి ముందుకు సాగింది. క్వార్టర్ ఫైనల్లో బెల్జియంను మట్టికరిపించి సెమీఫైనల్‌కు చేరుకుంది. ప్రపంచకప్ ఫైనల్ చేరడం స్పెయిన్‌కు ఇది రెండోసారి మాత్రమే. 2010లో తొలి సారి ఫైనల్లోకి చేరిన స్పెయిన్ టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాతి ప్రపంచకప్పుల్లో మాత్రం ఆ జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. 2014 ప్రపంచకప్‌లో స్పెయిన్ గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. 2018, 2022 ప్రపంచకప్పుల్లోనూ నాకౌట్ దశలో 16 జట్ల రౌండ్‌ను దాటలేకపోయింది. ఆ రెండు టోర్నీల్లోనూ రౌండ్ ఆఫ్ 16లోనే స్పెయిన్ ప్రయాణం ముగిసింది. ఈసారి మాత్రం స్పెయిన్ సమతూకమైన జట్టు ప్రదర్శనతో టైటిల్ పోరుకు చేరింది. దాడి, రక్షణ విభాగాల్లో సమన్వ-

## జపాన్ ఓపెన్‌లో సింధు శుభారంభం



జపాన్ ఓపెన్‌లో సింధు శుభారంభం టోక్యో: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు విజయంతో ఆరంభించింది. మహిళల సింగిల్స్ విభాగంలో మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సింధు మలేసియా ఆటగాళ్లైన వాంగ్ లింగ్‌పై సునాయాస విజయం సాధించింది. స్ట్రైట్ గేమ్‌లలో 21-14, 21-11తో ప్రత్యర్థిని మట్టికరిపించింది. తొలి గేమ్ ప్రారంభం నుంచే సింధు ఆధిపత్యం ప్రదర్శించింది. 7-4తో ముందంజలోకి వెళ్లిన ఆమె, ఆ తర్వాత పాయింట్లను వరుసగా గెలుచుకుంటూ గేమ్‌ను తన ఖాతాలో వేసుకుంది. నెట్ వద్ద చురుకుదనం, శక్తివంతమైన స్మాష్‌లు, కోర్టు కవరేజ్‌లో మెరుగైన ప్రదర్శనతో వాంగ్ లింగ్‌కు తేరుకునే అవకాశం ఇవ్వలేదు. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా ఆడింది. ప్రారంభం నుంచే దాడి ఆటకు శ్రీకారం చుట్టిన ఆమె 11-3తో విరామానికి వెళ్లి ఆధిక్యాన్ని మరింత పటిష్టం చేసింది. విరామం తర్వాత కూడా అదే ఊపును కొనసాగించిన సింధు, ప్రత్యర్థి రక్షణను ఛేదిస్తూ సులభంగా గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో సింధు రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. పురుషుల డబుల్స్ విభాగంలో భారత జంట సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి టోర్నమెంట్ నుంచి అర్ధంతరంగా నిష్క్రమించింది. డెన్మార్క్ ఆటగాళ్లైన డానియెల్-మాడ్స్ జంటతో జరిగిన తొలి రౌండ్ పోరులో సాత్విక్-చిరాగ్ ద్వయం 19-21తో తొలి గేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్‌కు ముందు సాత్విక్‌కు భుజం గాయం తీవ్రంగా ఇబ్బందిపెట్టడంతో భారత జంట

మన గళం మన బలం రాయలసీమన్యూస్



## భావోద్వేగ కుటుంబ కథతో ప్రేక్షకులను ఆకట్టుకోను...



భావోద్వేగ కుటుంబ కథతో ప్రేక్షకులను ఆకట్టుకోనున్న 'వెంకట్రామయ్య గారి తాలూకా' జానపద గాయని కోమలి నిర్మాతగా మారి నిర్మించిన భావోద్వేగ కుటుంబ కథా చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. దినేష్ కుమార్ హీరోగా, ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా పరిచయమవుతున్న ఈ చిత్రానికి సతీష్ ఆవాల కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందించడంతో పాటు దర్శకత్వం కూడా వహించారు. కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతుండటంతో, హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో మంగళవారం ప్రీ రిలీజ్ వేడుకను చిత్ర యూనిట్ ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రముఖ దర్శకుడు దశరథ్ కూడా వేడుకలో పాల్గొని, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హీరో దినేష్ కుమార్ చిత్ర నిర్మాణంపై మాట్లాడారు. చిన్న గ్రామం నుంచి వచ్చిన కోమలి నిర్మాతగా ఈ స్థాయిలో సినిమా నిర్మించడం ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి ప్రేక్షకుడి హృదయాన్ని తాకే భావోద్వేగ కథతో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయని తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా ఈ సినిమాను ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరోయిన్ దివిజ ప్రభాకర్ కూడా ఈ కార్యక్రమంలో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ సినిమా కథ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. చిత్ర యూనిట్ సభ్యులంతా ఎంతో అంకితభావంతో పనిచేశారని, ముఖ్యంగా నిర్మాత కోమలి ఎంతో శ్రమించి ఈ చిత్రాన్ని నిర్మించారని తెలిపారు. జూలై 17న థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేయాలని కోరుతూ, 'వెంకట్రామయ్య గారి తాలూకా' తప్పక విజయం సాధిస్తుందనే ధీమాను వ్యక్తం చేశారు. ఫోక్ సింగర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న కోమలి ఇప్పుడు నిర్మాతగా మారి మంచి సినిమా నిర్మించడం అభినందనీయం. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా. చిన్న సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పించాలి. తెలంగాణలో చిన్న చిత్రాల అభివృద్ధికి మా పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. తెలుగు సినిమాల మాదిరిగానే తెలుగు ప్రజలు కూడా ఐక్యంగా ఉండాలి. ముఖ్య అతిథిగా హాజరైన కల్వకుంట్ల కవిత ఈ మాటలతో కోమలి ప్రయత్నాన్ని అభినందిస్తూ, చిన్న సినిమాలకు ప్రభుత్వ స్థాయిలో మరింత ప్రోత్సాహం అవసరమని పిలుపునిచ్చారు. భావోద్వేగ కుటుంబ కథాంశంతో రూపొందిన 'వెంకట్రామయ్య గారి తాలూకా' చిత్రం ఇప్పటికే ప్రచార కార్యక్రమాలతో మంచి ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రైలర్, పాటలు, ప్రమోషనల్ ఈవెంట్ల ద్వారా గ్రామీణ నేపథ్యంలోని కుటుంబ భావోద్వేగాలు, సంబంధాలపై ఆధారపడిన కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి యూనిట్ కృషి చేస్తోంది. ఈ సినిమా థియేటర్లలో విడుదలైన తర్వాత ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

## హైదరాబాద్ మోకిల సమీపంలో రామ్ చరణ్-ఉపాసన...



హైదరాబాద్ మోకిల సమీపంలో రామ్ చరణ్-ఉపాసనల విలాసవంతమైన ఫామ్‌హౌస్ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కెరీర్‌లో మరో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'పెద్ది' సినిమా విజయంతో టాలీవుడ్‌లో మంచి జోష్‌లో ఉన్నాడు. జూన్ 4న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో కూడా రికార్డులు సృష్టిస్తోంది. ఈ విజయోత్సాహంతో రామ్ చరణ్ తన తదుపరి చిత్రానికి సన్నాహాలు చేస్తూ, వ్యక్తిగత జీవితంలోనూ ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వంలో రామ్ చరణ్ కొత్త సినిమా చేయడానికి సిద్ధమవుతున్నాడు. 'రంగస్థలం' వంటి కల్ట్ క్లాసిక్ తర్వాత ఈ కాంబినేషన్‌లో వస్తున్న కొత్త ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి ఇంకా కొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. సినిమాల విషయాన్ని పక్కన పెడితే, ప్రస్తుతం రామ్ చరణ్ మరో కారణంతో వార్తల్లో నిలుస్తున్నాడు. హైదరాబాద్ శివారులోని చేవెళ్ల-మోకిల పరిసర ప్రాంతంలో ఆయన భార్య ఉపాసనతో కలిసి కొత్తగా ఒక విలాసవంతమైన ఫామ్‌హౌస్ నిర్మించుకున్నట్లు సమాచారం. చాన్నాళ్ల క్రితమే ఈ ప్రాంతంలో రామ్ చరణ్-ఉపాసన 5 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసినట్టు తెలిసింది. అదే స్థలంలో ఇప్పుడు డ్రీమ్ ఫామ్‌హౌస్ రూపుదిద్దుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ ఫామ్‌హౌస్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలోనే గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా ఇంటీరియర్ డిజైన్, పచ్చదనం, ఆర్కిటెక్చర్ అంశాలను ప్రత్యేకంగా దృష్టిలో పెట్టుకుని ఈ ఫామ్‌హౌస్ రూపొందించినట్లు సమాచారం. కేవలం విశ్రాంతి కోసం మాత్రమే కాకుండా, ప్రకృతికి దగ్గరగా కుటుంబంతో సమయం గడపడం, ఆర్గానిక్ వ్యవసాయం చేయడం వంటి లక్ష్యాలతో ఈ ఫామ్‌హౌస్ డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. లగ్జరీ బెడ్‌రూమ్స్, విశాలమైన లివింగ్ స్పేస్, మోడ్రన్ కిచెన్, భారీ స్విమ్మింగ్ పూల్, జిమ్, మినీ థియేటర్, ఇండోర్ మరియు ఔట్‌డోర్ లాంజ్ ఏరియాలు ఈ ఫామ్‌హౌస్‌లో ఏర్పాటు చేసినట్లు సమాచారం. పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, అతిథుల కోసం గెస్ట్ సూట్స్, విస్తారమైన లాన్ వంటి సౌకర్యాలు కూడా ఈ డ్రీమ్ ఫామ్‌హౌస్‌లో ఉండబోతున్నాయని తెలిసింది. నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత కుటుంబ సభ్యుల సమక్షంలో గృహప్రవేశ వేడుక నిర్వహించే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ఫామ్‌హౌస్, గృహప్రవేశ కార్యక్రమం, ఇతర వివరాలపై ఇప్పటివరకు రామ్ చరణ్ లేదా ఆయన కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అభిమానులు, సినీ వర్గాలు మాత్రం రామ్ చరణ్-ఉపాసనల ఈ కొత్త ఫామ్‌హౌస్ గురించి ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

## రజనీకాం 'ధర్మన్'లో కీలక పాత్రలో రుక్మిణి వసంత్



రజనీకాంత్ 'ధర్మన్'లో కీలక పాత్రలో రుక్మిణి వసంత్ సూపర్‌స్టార్ రజనీకాంత్ వరుస చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం యంగ్ అండ్ టాలెంటెడ్ దర్శకుడు అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ధర్మన్' సినిమా షూటింగ్‌లో రజనీ బిజీగా ఉన్నారు. భారీ అంచనాలతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించి తాజా కాస్టింగ్ సమాచారం సినీ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. 'సప్త సాగరాలు దాటి' చిత్రంతో సౌత్ ఇండియా వ్యాప్తంగా మంచి గుర్తింపు, క్రేజ్ సంపాదించిన కన్నడ నటి రుక్మిణి వసంత్ ఇప్పుడు ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. 'ధర్మన్'లో ఆమె కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. తాజాగా రుక్మిణి ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయినట్టు తెలిసింది. లెజెండరీ నటుడు రజనీకాంత్‌తో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం దక్కడం రుక్మిణి వసంత్ కెరీర్‌లో కీలక మైలురాయిగా భావిస్తున్నారు సినీ విశ్లేషకులు. ఈ చిత్రం తన ప్రయాణంలో ప్రత్యేక స్థానం సంపాదిస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. దర్శకుడు అశ్వత్ మరిముత్తు 'ధర్మన్'ను హై వోల్టేజ్ ఎలిమెంట్స్‌తో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్‌ల మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకునేలా స్క్రీన్‌ప్లే ప్లాన్ చేసినట్లు చిత్రబృందం వర్గాల సమాచారం. రుక్మిణి వసంత్‌తో పాటు ఈ చిత్రంలో సీనియర్ నటి సిమ్రాన్, టాలెంటెడ్ నటి రాశీ ఖన్నా కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అలాగే స్టార్ కమెడియన్ యోగి బాబు తన ప్రత్యేక శైలిలో కామెడీతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. విభిన్న తరాల నటులు, ప్రముఖ తారలు ఒకే చిత్రంలో నటిస్తుండటంతో 'ధర్మన్'పై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో కూడా భారీ బజ్ నెలకొంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, కమల్ హాసన్ నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. రజనీకాంత్, కమల్ హాసన్, అనిరుధ్, అశ్వత్ మరిముత్తు వంటి పేరుగాంచిన పేర్లు ఒకే ప్రాజెక్ట్‌లో కలవడంతో 'ధర్మన్' విడుదలపై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. సినీ వర్గాల అంచనాల ప్రకారం, రజనీకాంత్ కెరీర్‌లో మరో కీలక కమర్షియల్ చిత్రంగా 'ధర్మన్' నిలిచే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. రుక్మిణి వసంత్ వంటి కొత్త తరహా నటుల చేరికతో చిత్రానికి కొత్త ఫ్లేవర్, ఫ్రెష్‌నెస్ వచ్చే అవకాశం ఉందని పరిశ్రమలో చర్చ నడుస్తోంది.

## రాజమౌళి 'వారణాసిలో 'మందాకినిగా మెరవనున్న ప్రి...

'వారణాసి' కోసం 14 నెలలుగా పనిచేస్తున్నాను: ప్రియాంక చోప్రా దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'పై కథానాయిక ప్రియాంక చోప్రా తాజా వ్యాఖ్యలు చేశారు. మహేశ్ బాబు హీరోగా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రియాంక 'మందాకిని' పాత్రలో నటిస్తున్నారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, ఈ సినిమా కోసం చేస్తున్న తన కృషి గురించి వివరించారు. "నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేను" అని ప్రియాంక చోప్రా తెలిపారు. ఇంతకుముందు కూడా 'వారణాసి' గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తిగా భిన్నమైనదని ఆమె పేర్కొన్నట్లు సమాచారం. రాజమౌళి శైలికి అనుగుణంగా ఈ చిత్రంలో యాక్షన్, భావోద్వేగాలకు సమాన ప్రాధాన్యం ఉంటుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన కీలక సన్నివేశాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తయిందని రాజమౌళి వెల్లడించారు. అక్టోబర్ నాటికి మొత్తం షూటింగ్ ముగించేలా ప్రణాళికలు వేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ప్రారంభించి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్ కార్యక్రమాలు మొదలుపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. 'వారణాసి' చిత్రాన్ని ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్రబృందం సిద్ధమవుతోంది. మహేశ్ బాబు కెరీర్‌లో కీలక మైలురాయిగా నిలిచే చిత్రంగా ఈ ప్రాజెక్ట్‌ను పరిశ్రమ వర్గాలు చూస్తున్నాయి. రాజమౌళి దర్శకత్వం, మహేశ్ బాబు నటన, ప్రియాంక చోప్రా పాత్రపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం చిత్ర యూనిట్ విదేశీ లొకేషన్లు, భారీ సెట్లలో మిగతా సన్నివేశాల చిత్రీకరణకు సిద్ధమవుతోంది. షూటింగ్ పూర్తయిన తర్వాత విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, ఇతర సాంకేతిక పనులకు ఎక్కువ సమయం కేటాయించనున్నట్లు సమాచారం. 'వారణాసి' విడుదల తేదీ ప్రకటించడంతో, తెలుగు సహా భారతీయ సినీ ప్రేక్షకుల్లో ఈ చిత్రంపై ఆసక్తి మరింత పెరిగింది.

## 'ఓ..! సుకుమారి' జులై 17న విడుదల



'ఓ..! సుకుమారి' జులై 17న విడుదల తిరువీర్, ఐశ్వర్యా రాజేష్ జంటగా నటించిన చిత్రం 'ఓ..! సుకుమారి' జులై 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. భరత్ దర్శన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో చిత్ర బృందం సినిమా విశేషాలను మీడియాతో పంచుకుంది. ఈ చిత్రంలో తిరువీర్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. తన పాత్ర, కథాంశం గురించి ఆయన సమావేశంలో వివరించారు. ఒక విభిన్నమైన కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం రొమాంటిక్, ఎమోషనల్ అంశాలతో పాటు వినోదాన్ని పంచేలా తెరకెక్కినట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ సినిమాలో నేనొక అప్‌కమింగ్ పొలిటీషియన్ పాత్రలో నటించాను. ఒక అమ్మాయి గుండె వేగం సాధారణ స్థాయిని దాటితే ఆమె శరీరం నుంచి ఎలక్ట్రిక్ షాక్ జనరేట్ అవుతుంది. అలాంటి అమ్మాయి జీవితంలోకి ప్రేమించిన అబ్బాయి వచ్చిన తర్వాత ఏం జరిగింది? అన్నదే ఈ సినిమా కథాంశం. ఈ సినిమా కథ కొత్తగా, ఆసక్తిగా ఉంటుంది. ప్రేక్షకులను నవ్వించడంతో పాటు భావోద్వేగానికి గురి చేస్తుంది. ఇక నెలకు దాదాపు 20 కథలు వింటాను. వీటిలో నాకు నచ్చిన కథలు చేస్తున్నాను. నా తర్వాతి చిత్రం 'భగవంతుడు' కొత్తగా ఉంటుంది. అలాగే అమెజాన్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌కు ఓ వెబ్ సిరీస్ చేస్తున్నాను. తిరువీర్ వ్యాఖ్యల ప్రకారం, ప్రస్తుతం తాను వినిపించే కథల్లో తనకు నచ్చినవే ఎంపిక చేసుకుని చేస్తున్నాడు. 'భగవంతుడు'తో పాటు అమెజాన్ ఓటీటీ కోసం రూపొందుతున్న వెబ్ సిరీస్ ద్వారా కూడా ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు. 'ఓ..! సుకుమారి' విడుదలకు సిద్ధమవుతుండగా, ఈ చిత్రంపై యువతలో ఆసక్తి నెలకొంటోంది.

## బాక్సాఫీస్ చరిత్రను తిరగరాసిన 'మైకె... రూ. 9,500 కోట్ల వసూళ్లతో ఆల్‌టైమ్ రికార్డ



బాక్సాఫీస్ చరిత్రను తిరగరాసిన 'మైకెల్'... రూ. 9,500 కోట్ల వసూళ్లతో ఆల్‌టైమ్ రికార్డ్ ఇటీవలి కాలంలో బయోపిక్‌ల హవా ప్రపంచవ్యాప్తంగా గట్టిగా కొనసాగుతోంది. సెలబ్రిటీల జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రాలు ప్రేక్షకులను బలంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పాప్ సంగీత ప్రపంచాన్ని దశాబ్దాల పాటు ఏలిన లెజెండ్ మైఖేల్ జాక్సన్ జీవితం ఆధారంగా రూపొందిన హాలీవుడ్ బయోపిక్ 'మైఖేల్ ప్రపంచ బాక్సాఫీస్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించింది. ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు అంటోనీ ఫుక్కుత్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రపంచవ్యాప్తంగా రికార్డ్ స్థాయి స్పందనను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, 'మైఖేల్' సినిమా వరల్డ్‌వైడ్‌గా 1 బిలియన్ డాలర్ల మైలురాయిని దాటేసి సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఒక్క నార్త్ అమెరికా మార్కెట్లోనే ఈ చిత్రం సుమారు 372 మిలియన్ డాలర్లు వసూలు చేయగా, అంతర్జాతీయ మార్కెట్లలో మరో 629 మిలియన్ డాలర్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. మొత్తం కలిపి భారతీయ కరెన్సీ ప్రకారం ఈ చిత్రం రూ. 9,500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను నమోదు చేసింది. దీంతో ప్రపంచంలోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన బయోపిక్‌గా 'మైఖేల్' చరిత్ర సృష్టించింది. ఈ ప్రభంజనంతో గతంలో అత్యధిక వసూళ్లు సాధించిన మ్యూజికల్ బయోపిక్ బొహేమియాన్ ర్హాపిసోడే ' రికార్డులను ఈ చిత్రం బద్దలు కొట్టింది. సుమారు 911 మిలియన్ డాలర్ల వసూళ్లు సాధించిన ఆ చిత్రాన్ని వెనక్కి నెట్టి మైఖేల్ ' కొత్త

## సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్యారడాక్స్'లో శక్తిమంతమైన అమ్మాయిగా హన్సిక



సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్యారడాక్స్'లో శక్తిమంతమైన అమ్మాయిగా హన్సిక అందాల తార హన్సిక చాలా కాలం తర్వాత మళ్లీ థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. 'ప్యారడాక్స్' అనే నాయికా ప్రాధాన్య చిత్రంలో ఆమె నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సమాచారం సామాజిక మాధ్యమాల ద్వారా అధికారికంగా వెలువడింది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంతో కన్నడకు చెందిన కొరియోగ్రాఫర్ కెప్టెన్ కిశోర్ దర్శకుడిగా మారుతున్నారు. కార్తిక్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ మేరకు చిత్రబృందం ఓ పోస్టర్‌ను Instagramలో ఆవిష్కరించింది. కన్నడలో అగ్రతార పునీత్ రాజ్‌కుమార్‌తో హన్సిక నటించిన 'బిందాస్' సినిమా తర్వాత ఆమె చేస్తున్న రెండో కన్నడ చిత్రం ఇదే కావడం విశేషం. ఆ సినిమా ద్వారా అక్కడి ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న హన్సిక, ఇప్పుడు 'ప్యారడాక్స్'తో మరోసారి కన్నడ ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. సస్పెన్స్, థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ కథలో ఒక శక్తిమంతమైన అమ్మాయి చుట్టూ కథ తిరుగుతుందని చిత్రవర్గాలు వెల్లడించాయి. అవయవాల అక్రమ రవాణా నేపథ్యాన్ని అన్వేషించే మిస్టరీ కథకు భావోద్వేగాలను మేళవిస్తూ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. "సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో ఒక శక్తిమంతమైన అమ్మాయి చుట్టూ తిరిగే కథ ఇది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది. అవయవాల అక్రమ రవాణాను అన్వేషిస్తూ సాగే మిస్టరీకి భావోద్వేగాలను మేళవించి రూపొందిస్తున్నాం"ని చిత్రవర్గాలు తెలిపాయి.

మన గళం మన కలం
రాయలసీమన్యూస్

బుధవారం · 15 జులై, 2026

క్లుప్త వార్తలు

## శ్రీశైలంలో భక్తుల రద్దీ: మల్లన్న దర్శనానికి నాలుగు గంటల సమయం

శ్రీశైలం లో భక్తుల రద్దీ: మల్లన్న దర్శనానికి నాలుగు గంటల సమయం శ్రీశైలం: అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మల్లన్న దేవస్థానానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. శ్రీస్వామి, అమ్మవార్ల దర్శనార్థం దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. ప్రధాన క్యూలైన్లు, దర్శన కంపార్టుమెంట్లు భక్తులతో నిండిపోవడంతో క్షేత్రం అంతటా సందడి వాతావరణం నెలకొంది. వేకువజామున నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అనంతరం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులుతీరుతున్నారు. ప్రస్తుత రద్దీ పరిస్థితుల్లో సాధారణ దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. భక్తుల అధిక రద్దీ దృష్ట్యా శని, ఆది, సోమవారాల్లో నిర్వహించే ఆర్జిత అభిషేకాలు, కుంకుమార్చన సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో సామాన్య భక్తులు ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా శ్రీస్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఆర్జిత సేవలు నిలిపివేత నిర్ణయం వల్ల సాధారణ భక్తులకు దర్శన సౌకర్యం మెరుగుపడిందని అధికారులు పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా VIP బ్రేక్ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు రెండు విడతలుగా మాత్రమే బ్రేక్ స్పర్శ దర్శనాన్ని అనుమతిస్తున్నారు. ఉదయం 7:30 గంటలకు, రాత్రి 9 గంటలకు ఈ బ్రేక్ దర్శనాన్ని కల్పిస్తున్నట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఈ సమయాలలో ఇతర సమయంలో VIP బ్రేక్ దర్శనానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. భక్తుల రద్దీ కారణంగా క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్త వార్తలు

## తిరుపతిలో మేస్త్రీపై దారుణ హత్యాయత్నం కేసు ఛేదన

తిరుపతి లో మేస్త్రీపై దారుణ హత్యాయత్నం కేసు ఛేదన తిరుపతి నగరంలో మేస్త్రీపై జరిగిన దారుణ హత్యాయత్నం కేసును పోలీసులు ఛేదించారు. మద్యం సేవిస్తున్న సమయంలో స్నాక్స్ తెచ్చుకునేందుకు బైక్ ఇవ్వనందుకు ఇద్దరు యువకులు పాశవికంగా దాడి చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ రవి మనోహరాచారి తెలిపారు. ఓటేరు పరిసరాల్లో జరిగిన ఈ కేసు వివరాలను మంగళవారం మీడియాకు వెల్లడించారు. కర్నూలు జిల్లా ఆదోని మండలం మదిరె గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసులు (36) ఏడేళ్లుగా తిరుపతిలో నివసిస్తూ మేస్త్రీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ రాత్రి ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లిన అనంతరం ఆయనపై దాడి జరిగినట్లు దర్యాప్తులో బయటపడింది. జాతీయ రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో శ్రీనివాసులు ఒంటరిగా కూర్చొని మద్యం సేవిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం ప్రకారం, అదే సమయంలో ఓటేరు ప్రాంతానికి చెందిన ఉప్పుసెట్టి ఆకాష్ (24), శ్రీనివాసపురానికి చెందిన రాఘవేంద్ర (20) మద్యం తీసుకుని అక్కడికి చేరుకున్నారు. తినుబండారాలు తెచ్చుకునేందుకు శ్రీనివాసులు వద్ద ఉన్న బైక్‌ను ఇవ్వాలని ఇద్దరూ కోరగా, ఆయన నిరాకరించినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో మత్తులో ఉన్న ఆ ఇద్దరూ ఆగ్రహానికి గురై బీరు సీసాలతో శ్రీనివాసులు తలపై కొట్టినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం సమీపంలో ఉన్న బండరాయితో ఆయన ముఖంపై మోదుతూ దాడి కొనసాగించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ సమయంలో దాడి దృశ్యాలను మొబైల్ ఫోన్‌లో వీడియోగా చిత్రీకరించినట్లు కూడా విచారణలో బయటపడింది.

క్లుప్త వార్తలు

## ఈరోజు రాశిఫలాలు 15.07.2026

ఈరోజు రాశిఫలాలు 15.07.2026 ఈరోజు పన్నెండు రాశుల వారికి సాధారణంగా అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉద్యోగం, వ్యాపారం, ఆర్థిక వ్యవహారాలు, కుటుంబ జీవితం, ఆరోగ్య పరంగా రాశి రాశికి పరిస్థితులు మారుతూ ఉంటాయి. జాగ్రత్త, ప్రణాళిక, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధ్యమని జ్యోతిష్య విశ్లేషణ సూచిస్తోంది. మేషం: ఈరోజు చేపట్టే పనుల్లో వేగం, స్పష్టత కనిపిస్తాయి. ఉద్యోగంలో ప్రతిభకు గుర్తింపు లభించే అవకాశం ఉంది. ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తే మంచి ఫలితాలు పొందుతారు. కుటుంబ సభ్యుల సహకారం ఉత్సాహాన్ని ఇస్తుంది. ఆరోగ్యంపై స్వల్ప శ్రద్ధ వహిస్తే రోజు సాఫీగా గడుస్తుంది. వృషభం: కొత్త అవకాశాలు ముందుకు రావచ్చు. ఉద్యోగంలో బాధ్యతలు పెరిగినా వాటిని సమర్థంగా నిర్వహిస్తారు. ఆదాయంలో స్వల్ప మెరుగుదల కనిపిస్తుంది. కుటుంబంలో సంతోషకరమైన వాతావరణం నెలకొంటుంది. ప్రయాణాలకు అనుకూలమైన రోజు. మిథునం: పని ఒత్తిడి ఉన్నప్పటికీ సమయానికి పనులు పూర్తి చేస్తారు. ఆర్థిక విషయాల్లో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవడం మంచిది. స్నేహితుల సహకారంతో ముఖ్యమైన పనులు సులభంగా పూర్తవుతాయి. కుటుంబ సభ్యులతో అనుబంధం బలపడుతుంది. ఆరోగ్యం సాధారణంగా ఉంటుంది. కర్కాటకం: చాలాకాలంగా ఎదురుచూస్తున్న పనులు ముందుకు సాగుతాయి. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. వ్యాపారంలో లాభదాయకమైన అవకాశాలు లభిస్తాయి. కుటుంబంలో శుభవార్తలు ఆనందాన్ని కలిగిస్తాయి. ఖర్చులను నియంత్రించడం మంచిది. సింహం: నిర్ణయాలు అనుకూల ఫలితాలను ఇస్తాయి. అధికారులతో జరిగే చర్చలు విజయవంతమవుతాయి. ఆర్థిక పరిస్థితి బలపడే సూచనలు ఉన్నాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా గడుపుతారు. కొత్త పనులు ప్రారంభించడానికి అనుకూలమైన రోజు. కన్య: ఉద్యోగంలో కొత్త బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. వ్యాపారంలో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. ఆరోగ్యపరంగా చిన్న జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయాన్ని అందుకుంటారు. తుల: చేపట్టిన పనులు కొంత ఆలస్యమైనా చివరకు విజయవంతంగా పూర్తవుతాయి. ఆర్థిక విషయాల్లో ప్రణాళికతో వ్యవహరించడం మంచిది. కుటుంబంలో ప్రశాంత వాతావరణం ఉంటుంది. ఉద్యోగంలో సహచరుల సహకారం లభిస్తుంది. ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలి. వృశ్చికం: భాగస్వామ్య వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగంలో ఉన్నతాధికారుల ప్రశంసలు పొందే అవకాశం ఉంది. ఆర్థిక లాభాలు పొందుతారు. కుటుంబంలో ఆనందకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. ధనస్సు: కృషికి తగిన ఫలితం లభిస్తుంది. కొత్త పరిచయాలు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. ఆదాయం పెరిగే సూచనలు ఉన్నాయి. కుటుంబ సభ్యులతో సఖ్యత నెలకొంటుంది. ముఖ్యమైన నిర్ణయాలను ధైర్యంగా తీసుకోవచ్చు. మకరం: ఉద్యోగంలో అనుకూల వాతావరణం ఉంటుంది. స్థిరాస్తి సంబంధిత పనులు ముందుకు సాగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లభిస్తుంది. ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం మంచిది. కుంభం: వ్యాపారంలో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో పనితీరుకు ప్రశంసలు దక్కుతాయి. ఆర్థికంగా లాభదాయకమైన రోజు. స్నేహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. కుటుంబంలో ఆనందం పెరుగుతుంది. మీనం: ఈరోజు అదృష్టం అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో ఆశించిన పురోగతి కనిపిస్తుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఆరోగ్యం సాధారణంగా అనుకూలంగా ఉంటుంది.

క్లుప్త వార్తలు

## రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ మృతి

రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ మృతి చిత్తూర్ జిల్లా:- చిత్తూరు ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దేవేంద్ర (32) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన పుంగనూరు-పలమనేరు జాతీయ రహదారి టోల్‌ప్లాజా సమీపంలోని కనుమలో గంగమ్మ గుడి వద్ద సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనపై స్థానికంగా విషాదం నెలకొంది. సీఐ సుబ్బరాయుడు తెలిపిన వివరాల ప్రకారం, మదనపల్లెలో కొనుగోలు చేసిన ఇంటి నివాస స్థలంపై వివాదం తలెత్తడంతో దేవేంద్ర సోమవారం మదనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆలస్యంగా మదనపల్లె నుంచి చిత్తూరు కు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పుంగనూరు సమీపంలో అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దేవేంద్ర అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దేవేంద్ర భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. రామిరెడ్డిగారిపల్లెకు చెందిన శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్‌ల వద్ద 2023లో తన భర్త దేవేంద్ర కొంత భూమిని కొనుగోలు చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అయితే అదే భూమిని 2014, 2020 సంవత్సరాల్లో వారు ఇతరులకు విక్రయించి డబ్బు తీసుకున్నారని, తమకు భూమిని చూపకపోవడంతో పాటు డబ్బు కూడా తిరిగి ఇవ్వలేదని లావణ్య పోలీసులకు వివరించినట్లు సమాచారం. భూమి కొనుగోలు వివాదంపై దేవేంద్ర సోమవారం మదనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసి తిరిగి వస్తున్న సమయంలోనే ప్రమాదం జరిగినట్లు లావణ్య పేర్కొన్నారు. ఫిర్యాదు చేసి చిత్తూరుకు బయలుదేరుతున్నట్లు దేవేంద్ర తన చరవాణి ద్వారా ఆమెకు తెలిపిన కొన్ని క్షణాల్లోనే ఈ ప్రమాదం జరిగిందని ఆమె అనుమానం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దేవేంద్ర మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, భూమి కొనుగోలు వ్యవహారంలో తన భర్తకు న్యాయం జరిగేలా చూడాలని లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుర్తు తెలియని వాహనాన్ని గుర్తించేందుకు జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద ఉన్న సీసీ కెమెరా దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

క్లుప్త వార్తలు

## వేములలో అక్రమ ముగ్గురాయి మైనింగ్ కేసు నమోదు

వేములలో అక్రమ ముగ్గురాయి మైనింగ్ కేసు నమోదు కడప జిల్లా వైఎస్సార్ కడపలోని వేముల మండలంలో జరుగుతున్న అక్రమ ముగ్గురాయి (Barytes) మైనింగ్‌పై ఒకటిన్నర సంవత్సరం తర్వాత పోలీసులు కేసు నమోదు చేశారు. వేముల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, అనంతరం జరిగిన విచారణ ఆధారంగా ఈ కేసు నమోదైనట్లు సమాచారం. వేముల మండలంలో టిఫిన్ కంపెనీకి చెందిన Barytes గనులు ఉన్నాయి. గత పదేళ్లుగా టిఫిన్ Barytes మైన్స్‌కు ప్రతినిధిగా పనిచేస్తున్న White Barytes ప్రతినిధి రాము, అరుదైన ఈ ఖనిజాన్ని కాపాడాలంటూ పోలీసులకు, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. రాము ప్రకారం, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్రమ మైనింగ్ జరుగుతోందని మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, పరిస్థితిలో మార్పు రాలేదని పేర్కొన్నారు. ముగ్గురాయి కోర్టు పరిధిలో ఉండగా, దానిని అక్రమంగా తరలిస్తున్నారని పలుమార్లు అధికారులకు తెలియజేసినట్లు ఆయన చెప్పారు. NCMLT తరఫున MSC సంస్థ తనను టేక్‌కేర్‌గా నియమించుకున్నారని రాము తెలిపారు. వేల టన్నుల ముగ్గురాయిని రాత్రికి రాత్రే అక్రమంగా తరలించారని, దీనిపై వేముల పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన వేముల సిఐ, తగిన ఆధారాలు సమర్పించాలని రామును కోరినట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా, అక్రమంగా ముగ్గురాయి తరలించిన తేదీలకు సంబంధించిన ఆధారాలు సహా అవసరమైన సమాచారం అందజేశానని రాము తెలిపారు. “విచారణ అధికారి వేముల సిఐ తగు ఆధారాలు చూపించమని కోరడంతో తగు ఆధారాలను చూపించడం జరిగింది. వేముల సిఐ పలు ప్రశ్నలు అడుగగా వాటికి నేను ఆధారాలు చూపించడం జరిగింది. ఏ తేదీ లో ముగ్గురాయిని తరలించారో ఆధారాలు చూపించడం జరిగింది,” అని రాము చెప్పారు. వేముల మండలంలో ఇప్పటికీ అక్రమ మైనింగ్ కొనసాగుతోందని రాము ఆరోపించారు. ఈ కేసు నమోదు, విచారణ వివరాలపై మరిన్ని సమాచారం కోసం స్థానికులు, బాధితులు ఎదురుచూస్తున్నారు.

## కదిరి =ూ కార్యాలయం తరలింపును అడ్డుకోవాలని ఎ...

కదిరి RTO కార్యాలయం తరలింపును అడ్డుకోవాలని వాహనదారుల వినతి కదిరి:- శ్రీ సత్యసాయి జిల్లా కదిరి RTO కార్యాలయాన్ని పుట్టపర్తికి తరలించే ప్రయత్నాలను నిలువరించాలని కోరుతూ కదిరి మినిలారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాహనదారులు స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. బైఫర్కేషన్ ప్రక్రియలో భాగంగా RTO కార్యాలయం పుట్టపర్తికి మార్పు చేసే అంశం వెలుగులోకి రావడంతో కదిరి ప్రాంత వాహన యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కదిరిలో RTO కార్యాలయం ఏర్పాటు కావడంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కీలక పాత్ర పోషించినట్లు వాహనదారులు గుర్తుచేశారు. కదిరి ప్రాంతంలో వేలాది మంది వాహనదారుల చిరకాల కోరిక అయిన RTO కార్యాలయం, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది నెలల్లోనే ఎమ్మెల్యే చొరవతో స్థాపించబడిందని వారు పేర్కొన్నారు. RTO కార్యాలయం కదిరిలో ఏర్పాటు కావడంతో వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, పర్మిట్లు, ఇతర పరిపాలనా సేవలు స్థానికంగా అందుబాటులోకి వచ్చాయని, దీంతో వాహనదారులకు భారీగా సౌలభ్యం కలిగిందని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఇలాంటి కార్యాలయాన్ని మరోసారి దూర ప్రాంతమైన పుట్టపర్తికి తరలిస్తే తమకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కదిరి నుంచి RTO కార్యాలయం తరలింపుపై జరుగుతున్న ప్రయత్నాల నేపథ్యంలో, కార్యాలయం ఇక్కడే కొనసాగాలని, వాహనదారుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరుతూ వాహనదారులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను, భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. వాహనదారుల వినతికి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పై విధంగా హామీ ఇచ్చినట్లు కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు.

## తెలుగు రాష్ట్రాల్లో 22 వరకు ఎండ తీవ్రం... తర్వాతే వర్ష సూచనలు

తెలుగు రాష్ట్రాల్లో 22 వరకు ఎండ తీవ్రం... తర్వాతే వర్ష సూచనలు తెలుగు రాష్ట్రాల్లో జులై 22 వరకు వేడి గాలులు, పొడి వాతావరణం కొనసాగనుందని వాతావరణ శాఖ సూచనలు తెలియజేస్తున్నాయి. 22 తర్వాత సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో వర్షాల సూచనలు కనిపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో గత కొన్ని రోజులు నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. పగటి వేళల్లో ఎండ తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో వేడి గాలులు, పొడి వాతావరణం మరింతగా ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితి ఈ నెల 22 వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తాజా అంచనాలు సూచిస్తున్నాయి. వాతావరణ నిపుణుల విశ్లేషణ ప్రకారం, ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలపై ప్రభావం చూపే విధంగా పెద్దగా వర్షాలు కురిసే పరిస్థితి లేదు. సముద్రంపై తేమ గాలుల ప్రవాహం పరిమితంగా ఉండటంతో వర్షాల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఇంకా పూర్తిగా రూపుదిద్దుకోలేదని వారు చెబుతున్నారు. దీంతో ఈ నెల 22 వరకు వేడి గాలులు, పొడి గాలులే ప్రధానంగా కొనసాగనున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 22 తర్వాత సముద్రంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రాథమిక సూచనలు తెలియజేస్తున్నాయి. అల్పపీడనం బలపడితే తెలుగు రాష్ట్రాలపై తేమ గాలుల ప్రవాహం పెరిగి, వర్షాల అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అయితే అల్పపీడనం తీవ్రత, దిశ, వేగం వంటి అంశాలపై ఆధారపడి వర్షాల పరిమాణం, విస్తృతి నిర్ణయించబడనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పగటి వేళల్లో బయటకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో ఎక్కువసేపు నేరుగా ఎండలో ఉండకుండా, తగినంత నీరు తాగుతూ శరీరాన్ని తేమతో ఉంచుకోవాలని వారు సూచిస్తున్నారు.

క్లుప్త వార్తలు

## శ్రీవారి దర్శనం పేరుతో మోసాలు.. టీటీడీ మాజీ ఉద్యోగి అరుణ్‌కుమార్ అరెస్ట్

శ్రీవారి దర్శనం పేరుతో మోసాలు.. టీటీడీ మాజీ ఉద్యోగి అరుణ్‌కుమార్ అరెస్ట్ తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానం (TTD) మాజీ ఉద్యోగి అరుణ్‌కుమార్‌ను శ్రీవారి దర్శనం, వసతి, సేవా టికెట్ల పేరుతో భక్తులను మోసం చేసిన కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరు ప్రాంతానికి చెందిన భక్తుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు విచారణలో బయటపడింది. పోలీసుల సమాచారం ప్రకారం, అరుణ్‌కుమార్ శ్రీవారి దర్శనం, వసతి, వివిధ సేవల టికెట్లు కల్పిస్తానని భక్తులను నమ్మించి డబ్బులు తీసుకున్నాడు. ఈ క్రమంలో బెంగళూరు భక్తుల నుంచి మాత్రమే సుమారు రూ.3.20 లక్షలు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. నిందితుడి బ్యాంకు ఖాతాలను పరిశీలించిన పోలీసులు, మొత్తం రూ.85 లక్షల వరకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ లావాదేవీలలో శ్రీవారి దర్శనం, వసతి, సేవా టికెట్ల పేరుతో భక్తుల నుంచి వసూలు చేసిన డబ్బులు కూడా ఉన్నాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అరుణ్‌కుమార్ 2023 సంవత్సరంలో ఈ మోసాలకు పాల్పడ్డాడని టీటీడీ నిర్వహించిన అంతర్గత విచారణలో తేలడంతో, అతనిపై టీటీడీ ప్రత్యేక వేట ప్రారంభించింది. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు సందర్భంగా నిందితుడి వద్ద నుంచి రూ.99 వేల నగదు, ఒక మొబైల్ ఫోన్, మూడు బ్యాంకు పాస్‌బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి ద్వారా మరిన్ని లావాదేవీల వివరాలు, మోసపోయిన భక్తుల సంఖ్యను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. టీటీడీ పరిధిలో పనిచేసిన మాజీ ఉద్యోగి ఇలాంటి మోసాలకు పాల్పడటం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి దర్శనం, వసతి, సేవా టికెట్ల కోసం అధికారిక మార్గాల ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలని, వ్యక్తిగత పరిచయాలు, మధ్యవర్తుల ద్వారా డబ్బులు చెల్లించవద్దని అధికారులు భక్తులకు సూచిస్తున్నారు. అరుణ్‌కుమార్ మోసాలకు గురైన భక్తులు ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని, తద్వారా కేసు దర్యాప్తు మరింత వేగవంతం చేసి, బాధితులకు న్యాయం చేయగలమని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి, మరిన్ని వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్త వార్తలు

## హోర్ముజ్‌లో ఉద్రిక్తత.. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం

హోర్ముజ్‌లో ఉద్రిక్తత.. ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ తూట్లు పొడవటంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న నౌకలపై ఇరాన్ సైన్యం దాడులకు పాల్పడుతోంది. రెండు రోజుల క్రితం హోర్ముజ్ జలసంధిలోని ఒమన్ ప్రాంతీయ జలాల్లో ప్రయాణిస్తున్న రెండు యూఏఈ ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ దాడులు చేసింది. ఈ మిసైల్ దాడుల కారణంగా ట్యాంకర్‌లో పనిచేస్తున్న ఓ భారతీయుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో ఆరుగురు భారతీయులు తీవ్రంగా గాయపడ్డారు. మళ్లీ దిగ్బంధనం.. కాల్పుల విరమణను తుంగలో తొక్కి... హోర్ముజ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయడాన్ని అమెరికా తీవ్రంగా తప్పుబడుతోంది. గత కొద్దిరోజుల నుంచి ఇరాన్‌పై వైమానిక దాడులు చేస్తోంది. హోర్ముజ్‌లో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేస్తున్న సంఘటనలు పెరగటంతో అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని మళ్లీ అమలులోకి తెచ్చింది. అమెరికా ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని విధించింది. రెండు దేశాల మధ్య ఒప్పందం కారణంగా దిగ్బంధనాన్ని తాత్కాలికంగా ఎత్తివేసింది. ఇప్పుడు పరిస్థితులు మొదటికి రావటంతో.. దిగ్బంధనాన్ని మళ్లీ అమలులోకి తెచ్చింది. కాగా, మంగళవారం తెల్లవారుజామున ఇరాన్ తీర ప్రాంతాల్లోని లక్ష్యాలపై అమెరికా దాడులు చేసింది. బుషెహర్, చబహార్, జాస్క్, కొనారక్, అబు మూసా, బందర్ అబ్బాస్ పట్టణాల్లోని ఇరాన్ తీర రక్షణ వ్యవస్థలు, క్షిపణులు, డ్రోన్ల నిల్వ కేంద్రాలు, లాంచర్లను, పోర్టుల్లోని మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్టు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. పశ్చిమాసియాలో ప్రస్తుతం 50 వేల మంది అమెరికా సైనికులు మోహరించి ఉన్నారని.. ఎప్పుడైనా, ఏ స్థాయి దాడికైనా తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది.

క్లుప్త వార్తలు

## పీఓకేలో రక్తపాతం.. పాక్ బలగాల కాల్పుల్లో ఆరుగురు మృతి

పీఓకేలో రక్తపాతం.. పాక్ బలగాల కాల్పుల్లో ఆరుగురు మృతి పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రావల్ కోట్ ప్రాంతంలో పాక్ భద్రతా బలగాల కాల్పుల్లో ఆరుగురు సాధారణ పౌరులు మరణించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన అక్కడి స్థానికుల్లో మరింత ఆగ్రహాన్ని పెంచింది. గత కొన్ని రోజులుగా హక్కుల కోసం పీఓకే ప్రజలు ఉద్యమిస్తున్నారు. దీనిని అణచివేయడానికి పాక్ ఆర్మీ, ప్రభుత్వం రక్తపాతానికి పాల్పడుతోంది. రావల్‌కోట్ లోని న్యూ బస్ టెర్మినల్ సమీపంలో స్థానికులు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణ ఏర్పడింది. ఈ సమయంలో భద్రతా బలగాలు కాల్పులు జరపడంతో పలువురు పౌరులు మరణించారు. మరణించిన వారిలో జాహిద్ ముఘల్, జఫర్ ముఘల్, అర్సలాన్ అక్బర్, వజీద్ హయత్ ఉన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. మరోవైపు, పీఓకే ప్రవాసులు అమెరికాలోని వాషింగ్టన్ వైట్‌హౌజ్ ముందు నిరసన చేపట్టారు. మహిళలు, చిన్నారులు సహా దాదాపు 100 మందికి పైగా ఆందోళనల్లో పాల్గొన్నారు. పీఓకే నుంచి పాక్ సైన్యం ఉపసంహరించుకోవాలని, నిరాయుధ ప్రజలపై బలప్రయోగాన్ని నిలిపేయాలని వారు డిమాండ్ చేశారు. పీఓకేలో పాకిస్తాన్ ఇంటర్నెట్ నిలిపేయడం వల్ల 40 లక్షల మంది ప్రజలకు ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయని ఆరోపించారు. అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని, మానవతా సాయం అందించేందుకు భారత్‌లోని పూంచ్, దోడా మార్గాలను తెరవాలని పీఓకే ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

క్లుప్త వార్తలు

## సుప్రీంకోర్టులో అనుచిత ప్రవర్తన.. న్యాయశాస్త్ర విద్యార్థుల అరెస్టు

సుప్రీంకోర్టులో అనుచిత ప్రవర్తన.. న్యాయశాస్త్ర విద్యార్థుల అరెస్టు సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కోర్టు కార్యకలాపాలకు అంతరాయం కలిగించిన ఇద్దరు న్యాయ విద్యార్థులను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ప్రభల్ ప్రతాప్ సింగ్, చందర్ భాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. జులై 10న కోర్టులో ప్రభల్ ప్రతాప్ ప్రధాన న్యాయమూర్తిపై దుర్భాషలాడటమే కాకుండా కాగితాలు విసిరి గందరగోళం సృష్టించిన విషయం తెలిసిందే. అడ్డుకునేందుకు ప్రయత్నించిన భద్రతా సిబ్బందిని తోసి విధులకు ఆటంకం కలిగించాడు. అతడితో పాటు ఉన్న రెండో నిందితుడు చందర్ భాన్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ విద్యార్థులిద్దరూ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారు. అయితే.. ఈ ఘటనపై కోర్టు ధిక్కార చర్యలు చేపట్టబోమని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. ‘‘అతడు తీవ్ర మానసిక ఆవేదనలో ఉన్నాడు. నిరాశతో అలా ప్రవర్తించాడు. అతడిపై మాకు సానుభూతి మాత్రమే ఉంది’’ అని వ్యాఖ్యానించింది. ప్రధాన న్యాయమూర్తి (Chief Justice of India) జస్టిస్ సూర్యకాంత్ దీనిపై మాట్లాడుతూ.. ‘‘ఈ ఘటనను పెద్దది చేయొద్దు. యువత కొన్ని సందర్భాల్లో ఇలా ప్రవర్తిస్తారు. రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడడం అందరి బాధ్యత’’ అని పేర్కొన్నారు.

క్లుప్త వార్తలు

## ప్రేమ వేధింపుల వివాదం: మాదాపూర్‌లో యువకుడి హత్య

ప్రేమ వేధింపుల వివాదం: మాదాపూర్‌లో యువకుడి హత్య, హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ప్రేమ వేధింపుల వివాదం దారుణ హత్యకు దారితీసింది. మాదాపూర్‌లోని రామేశ్వరం కేఫే ఎదుట భాస్కర్ అనే యువకుడిపై ఇద్దరు వ్యక్తులు కర్రలు, కత్తులతో దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, భాస్కర్ ఇద్దరు యువతులను వేధిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై గతంలో మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైనట్లు తెలుస్తోంది. ఆ ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఇరు వర్గాలను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ భాస్కర్ ప్రవర్తనలో మార్పు రాలేదని విచారణలో బయటపడింది. ఇటీవలి కాలంలో భాస్కర్ యువతుల కుటుంబాలను రెచ్చగొట్టేలా ప్రవర్తించినట్లు సమాచారం. “దమ్ముంటే హైదరాబాద్‌కు రండి” అంటూ సవాల్ విసిరినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ #హనతో ఆగ్రహానికి గురైన యువతుల తండ్రి, మరో వ్యక్తితో కలిసి వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. మాదాపూర్‌కు చేరుకున్న ఇద్దరు వ్యక్తులు ముందస్తు పథకం ప్రకారం భాస్కర్‌పై దాడి చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. రామేశ్వరం కేఫే ఎదుట భాస్కర్‌ను గుర్తించిన వారు కర్రలు, కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో అతడు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటన అనంతరం పరిసర ప్రాంతంలో గందరగోళం నెలకొంది. హత్య అనంతరం నిందితులిద్దరూ స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. తమను తాము సమర్పించుకున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

క్లుప్త వార్తలు

## కర్నూలులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై మున్సిపల్ దాడులు ముమ్మరం

కర్నూలు లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై మున్సిపల్ దాడులు ముమ్మరం కర్నూలు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు నగరపాలక సంస్థ చర్యలను ముమ్మరం చేసింది. పర్యావరణం, ప్రజారోగ్యానికి హానికరమైన నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై ప్రత్యేక దాడులు నిర్వహిస్తూ, భారీగా జరిమానాలు విధిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. సోమవారం కమిషనర్ చల్లా ఓబులేసు పాత బస్టాండ్ పరిసర ప్రాంతంలోని దుకాణాలను సందర్శించారు. అక్కడ వ్యాపారులతో సమావేశమై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే అవసరాన్ని వివరించి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ, నగరంలో ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛందంగా పూర్తిగా నిలిపివేయాలని కోరారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు నగరపాలక సంస్థ నిరంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 201 దాడులు నిర్వహించి, 250 కిలోలకు పైగా నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మొత్తం రూ.1,95,150 జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై నగరపాలక సంస్థ కఠినంగా వ్యవహరిస్తోందని. ఇకపై కూడా తనిఖీలను మరింత కఠినతరం చేయనున్నట్లు సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కమిష-

క్లుప్త వార్తలు

## సాయికృష్ణ కేసు.. 23కి వాయిదా వేసిన సుప్రీం

సాయికృష్ణ కేసు.. 23కి వాయిదా వేసిన సుప్రీం గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఈరోజు (బుధవారం) విచారణ జరిగింది. ఈ కేసు తదుపరి విచారణను జులై 23వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ముందు ఈ కేసు విచారణ జరిగింది. ఏపీ ప్రభుత్వం తరఫున దాఖలైన పిటిషన్‌పై స్పందించేందుకు ప్రతివాది, కృష్ణలంక మాజీ సీఐ నాగరాజుకు సుప్రీంకోర్టు వారం రోజుల సమయం ఇచ్చింది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీకి సంబంధించి హైకోర్టు విధించిన షరతులను సవాల్ చేస్తూ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏపీ హైకోర్టు తన తీర్పులో నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలని, కస్టడీ విచారణలో పలు కఠిన నిబంధనలు పాటించాలని ఆదేశించింది. అయితే ఈ షరతులపై రాష్ట్ర ప్రభుత్వం, సిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నిరంతర వీడియో నిఘా కారణంగా దర్యాప్తు గోప్యత దెబ్బతినే అవకాశం ఉందని ఏపీ సర్కార్ తెలిపింది. ఈ కేసు విచారణకు సంబంధించిన కీలక అంశాలు బయటకు వెళ్లే ప్రమాదం ఉందని ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది. అదేవిధంగా సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, సంఘటన స్థల పునర్నిర్మాణం (సీన్ రికన్‌స్ట్రక్షన్) వంటి కీలక దర్యాప్తు చర్యలకు హైకోర్టు విధించిన నిబంధనలు అడ్డంకిగా మారుతున్నాయని సిట్ అధికారులు వాదించారు.